
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 14 ఆగస్టు 2025



దూరవిద్య ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ
ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
6లో

జిల్లాలోకి ఎస్.కోట?



ఎస్.కోట, కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి మండలాలు విలీనం ప్రతిపాదన

- పార్లమెంటు నియోజకవర్గం మొత్తం ఒకే జిల్లాలో ఉండేలా చూడాలని యోచన
- 'పెందుర్తి'పైనా చర్చ

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్రంలో జిల్లాల పునర్విభజనపై మళ్లీ చర్చ జరుగుతోంది. విశాఖ జిల్లా స్వరూపం మారే సూచనలు కనిపిస్తున్నాయి. పార్లమెంటు నియోజకవర్గ మంతా ఒక జిల్లా పరిధిలో ఉండాలనేది ఒక ప్రతిపాదన. ఆ విధంగా ఉన్నట్టయితే అన్నింటికీ వెసులుబాటుగా ఉంటుందని, ఇబ్బందులు ఉండవని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాల పునర్విభజన జరిగితే కొన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఉంది.**

విశాఖ పార్లమెంటు పరిధిలో గల శృంగవరపుకోట అసెంబ్లీ నియోజకవర్గం ప్రస్తుతం విజయనగరం జిల్లాలో ఉంది. దానిని ఇప్పుడు విశాఖ జిల్లా పరిధిలోకి తీసుకురావాలని ప్రతిపాదిస్తున్నారు. అలా చేసినట్టయితే ఆ అసెంబ్లీ నియోజకవర్గంలోని ఎస్.కోట, లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, జామి మండలాలు విశాఖ జిల్లాలోకి వస్తాయి.

పెందుర్తిని మార్చాల్సి ఉంది

పెందుర్తి అసెంబ్లీ నియోజకవర్గం అనకాపల్లి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఉంది. అయితే ఆ నియోజకవర్గంలోని పరవాడ, సబ్బవరం మండలాలు అనకాపల్లి జిల్లాలో ఉండగా, పెందుర్తి మండలం మాత్రం విశాఖ జిల్లాలో ఉంది.

డివిజన్ల ఏర్పాటు కూడా మార్చాలి

కొత్త జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు రెవెన్యూ డివిజన్ల విభజన సక్రమంగా జరగలేదు. విశాఖపట్నం నగరం నడిబొడ్డునున్న అక్కయ్యపాలెం, సీతమ్మధార, మద్దిలపాలెం ప్రాంతాలు భీమిలి రెవెన్యూ డివిజన్‌లో ఉన్నాయి. ఆ డివిజన్‌లో చినగదిలి, సీతమ్మధార మండలాలను చేర్చారు. వాస్తవానికి అవి విశాఖ రెవెన్యూ డివిజన్‌లో ఉండాలి. ఇప్పుడైనా వీటిని మార్చాల్సి ఉంది.

ఏయూలో తిరంగా ర్యాలీ



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బుధవారం తిరంగా ర్యాలీ జరిగింది. సుమారు 400 అడుగుల జాతీయ పతాకంతో ఏయూ ఉద్యోగులు, విద్యార్థులు, ఎన్‌సీసీ వలంటీర్లు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాన్ని వీసీ ఆచార్య రాజశేఖర్ ప్రారంభించగా, రెక్టార్ ఆచార్య ఎన్.కిశోర్‌బాబు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ధనుంజయరావు, డీన్‌లు కె.రమాసుధ, ఎస్.హరనాథ్, తదితరులు పాల్గొన్నారు.
-విశాఖపట్నం/ఆంధ్రజ్యోతి

వర్షం



అల్పపీడనం ప్రభావంతో బుధవారం రాత్రి నగరంలోని పలుచోట్ల ఒక మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన ఎండ, ఉక్కపోతతో నగరవాసులు అల్లాడిపోయారు. అయితే, రాత్రి ఏడు గంటల సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారింది. మేఘాలు ఆవరించడంతో భారీవర్షం కురుస్తుందని అంతా భావించారు. అయితే, కొన్నిచోట్ల మాత్రమే జల్లులు పడ్డాయి. అది కూడా కొద్దిసేపే. దీంతో వాతావరణం చల్లబడకపోగా మరింత వేడిగా మారింది.

స్త్రీశక్తికి సర్వం సిద్ధం

జిల్లాలో 804 బస్సులు

- అందులో ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు **570**

పై ఐదు రకాల బస్సుల్లోనూ ఉచితంగా ప్రయాణించేందుకు మహిళలకు అవకాశం

రీజియన్‌లోని ఏడు డిపోల్లోను రేపు మధ్యాహ్నం ప్రారంభోత్సవాలు

ద్వారకా బస్‌స్టేషన్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న 'స్త్రీ శక్తి' (మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సదుపాయం) పథకం అమలుకు విశాఖ అధికారులు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు.**



బస్సులను సిద్ధం చేస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర రాజధానిలో శుక్రవారం ఈ పథకాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జిల్లాలోని మధురవాడ, వాల్తేరు, మద్దిలపాలెం, విశాఖపట్నం, గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల్లో ఉచిత రవాణా బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి. ప్రతి డిపోలోను తొలుత ఐదేసి బస్సులను ప్రారంభినున్నట్టు అధికారులు వెల్లడించారు. ఆ తరువాత షెడ్యూల్ ప్రకారం అన్ని బస్సులు రవాణా సేవలందించనున్నాయి.

విశాఖ జిల్లాలో గల ఏడు డిపోల్లో 804 బస్సులు ఉన్నాయి. అందులో ఆర్డినరీ, పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, మెట్రో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు 570 ఉన్నాయి. ఈ బస్సులన్నింటిలో మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చునని ఆర్టీసీ అధికారులు వెల్లడించారు. ఉచిత రవాణా కారణంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళల సంఖ్య అనూహ్యంగా పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు. జిల్లాలో ప్రస్తుతం ప్రతిరోజూ ఆర్టీసీ బస్సుల్లో సుమారు 80 వేల మంది మహిళలు ప్రయాణిస్తున్నారని, ఉచిత రవాణా ప్రారంభమైన తరువాత ఈ సంఖ్య 1.2 లక్షలకు చేరుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్యను

... మిగతా 6వ పేజీలో

అన్ని డిపోల్లోను బస్సులు అందుబాటులో ఉంటాయి



- బి.అప్పలనాయుడు, రీజనల్ మేనేజర్, విశాఖపట్నం

మహిళలకు ఉచిత రవాణా అందించే బస్సులు అన్ని డిపోల్లోను అందుబాటులో ఉంటాయి. ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా వాటిని వినియోగిస్తాం. రీజియన్‌లోని ఏడు డిపోల మేనేజర్లు, అసిస్టెంట్ మేనేజర్లు, ట్రాఫిక్ మేనేజర్లు మహిళా ప్రయాణికుల డిమాండ్‌ను ఎప్పటికప్పుడు అంచనా వేసి అందుకు అవసరమైన రూట్లలో అదనపు బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకుంటారు. మహిళా ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నదే ఆర్టీసీ లక్ష్యం.

దాతలకే మస్కా!?

కనకమహాలక్ష్మి ఆలయ సిబ్బందిపై విమర్శలు

- అలాగైతే విరాళాలు ఎలా వస్తాయి
- చర్చనీయాంశంగా 'వెండి' వ్యవహారం
- విచారణకు నేరుగా కమిషనర్ నుంచే ఉత్తర్వులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): **నగరంలో ప్రముఖ షాపింగ్‌మాల్ అధినేతకే కనకమహాలక్ష్మి ఆలయ అధికారులు మస్కా కొట్టడం అందరినీ ఆశ్చర్యపరిచింది. అమ్మవారికి వెండి తాపడం కొత్తది చేయించి ఇస్తే, పాత వెండి ఇస్తామని హామీ ఇచ్చి నాలుగేళ్లయినా కనీసం ఒక్కగ్రాము కూడా ఇవ్వకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అంతేగాకుండా 60 కిలోల వెండి తాపడం తీసుకొని రశీదు కూడా ఇవ్వలేదు. ఇందుకు సంబంధించి 'వెండిపై వివాదం' శీర్షికతో బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం చర్చకు దారితీసింది. ఇలాగైతే దాతలు ఆలయానికి విరాళాలు ఇవ్వడానికి ముందుకువస్తారా?...అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.**



కనకమహాలక్ష్మి దేవస్థానంలో
వెండిపై వివాదం

'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనం

ఆలయంలో విజయ దశమి సందర్భంగా అమ్మవారికి రోజుకొక అలంకరణ చేస్తారు. ఒక రోజు కూరగాయలతో, మరో రోజు గాజులతో, ఇంకో రోజు లడ్డూలతో ఇలా అలంకరిస్తారు. వీటికి ఒక్కో రోజు ఒక్కో దాత విరాళం ఇస్తారు. వాటిలో కూడా తప్పుడు లెక్కలు చూపుతున్నారనే అభియోగాలు ఉన్నాయి. ఒక ఏడాది గాజులకు రూ.25 వేలు తీసుకుంటే, మరుసటి ఏడాది అదే గాజులకు రూ.40వేలు తీసుకున్నారని ఓ దాత బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి తెలిపారు. అదేవిధంగా ఆలయంలో నిర్వహించే హోమాలు, పూజలకు వస్తు సామగ్రి సమకూర్చాల్సిందిగా ఆలయ వర్గాలు కోరతాయని, వాటికి అయ్యే వ్యయం అంతా తామే పెట్టుకుంటామని, అలాంటి వాటికి కూడా రశీదులు ఇవ్వడం లేదని మరో దాత ఆరోపించారు. పెద్ద పెద్ద మొత్తాలు విరాళంగా ఇచ్చేవే పుస్తకాల్లో లెక్కలు చూపించకపోతే ఇక చిన్న చిన్నవి ఎన్ని మాయం అవుతున్నాయో ఎవరికి తెలుసు?...అనే మాటలు కూడా వినిపిస్తున్నాయి. సిబ్బంది పనితీరు కొంత గందరగోళంగా ఉందనే విమర్శలు వస్తున్నాయి.

నిబంధనలు పాటించరా..?

విరాళం కింద వంద రూపాయలు ఇచ్చినా, గ్రాము బంగారం ఇచ్చినా...దాతల ముందే దానిని తూకం వేసి పుస్తకంలో రాసి రశీదు ఇవ్వాలి. ఇది నిబంధన. అయితే ఏకంగా 60 కిలోల వెండితో తాపడం చేయిస్తే...ఆ వివరాలు పుస్తకాల్లో ఎక్కడా లేకపోవడం ఏమిటో అంతుబట్టడం లేదు. వాటి లెక్కలు అప్పగించకుండా

... మిగతా 6వ పేజీలో

అక్కరకు రాని ఆయుష్ ల్యాబ్!

శొంఠ్యాంలో రూ.8 కోట్లతో నిర్మాణం

పది నెలల కిందట పనులు పూర్తి

- పరికరాలు కొనుగోలు చేయకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇంకా అందుబాటులోకి రాని వైనం
- లేబొరేటరీ ప్రారంభమైతే మందుల నాణ్యత పరీక్షలు వేగవంతమయ్యేందుకు అవకాశం

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): **రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని శొంఠ్యాంలో ఏర్పాటుచేసిన ఆయుష్ డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ ఇంకా సేవలు ప్రారంభించలేదు. సుమారు రూ.8 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తయ్యి పది నెలలు దాటుతోంది. అయితే పరికరాలు కొనుగోలు చేయకపోవడం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో ల్యాబ్ ప్రారంభంలో జాప్యం జరుగుతోంది. ఈ ల్యాబ్ అందుబాటులోకి వస్తే ఆయుష్ విభాగానికి సంబంధించిన తయారైన మందులను ఇక్కడే పరీక్షించేందుకు అవకాశం కలుగుతుంది.**



నిర్మాణం పూర్తయిన భవనం

ప్రస్తుతం ఆయుర్వేద, యునాని, హోమియో వంటి విభాగాలకు సంబంధించిన మందులను తయారుచేసే కంపెనీలు వాటిని పరీక్షల నిమిత్తం హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల్లోని ల్యాబ్‌లకు పంపిస్తున్నాయి. అక్కడ పరీక్షలు పూర్తిచేసుకుని వచ్చేసరికి సమయం పడుతోంది. ఇది ఆయా మందులు అందుబాటులోకి వచ్చే కాల వ్యవధిని పెంచేలా చేస్తోందని భావించిన ప్రభుత్వం రాష్ట్రంలోనే ఒక డ్రగ్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని భావించింది. అందుకు అనుగుణంగా శొంఠ్యాంలో కొన్నాళ్ల కిందట ల్యాబ్ నిర్మాణ పనులను ప్రారంభించి సుమారు పది నెలల కిందట పూర్తిచేసింది. అయితే, భవన నిర్మాణ పనులు పూర్తయినప్పటికీ పరికరాల కొనుగోలు చేయకపోవడం, మౌలిక వసతులు కల్పించకపోవడం సమస్యగా మారింది. సుమారు రెండు కోట్ల రూపాయల విలువైన పరికరాల కొనుగోలుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిధులను మంజూరుచేసినట్టు ప్రకటించినప్పటికీ విడుదల చేయకపోవడంతో అడుగు ముందుకుపడడం లేదు.

అదనపు భారంతో ఇబ్బందులు

రాష్ట్ర విభజన తరువాత ఏపీలో డ్రగ్ టెస్టింగ్ లేబొరేటరీ, ఆయుర్వేద మందుల మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ లేకపోవడంతో ఇబ్బందిగా మారింది. ఈ ఇబ్బందులను గుర్తించే ప్రభుత్వం ల్యాబ్‌ను విశాఖలో ఏర్పాటు చేసేందుకు ముందుకువచ్చింది. ల్యాబ్ అందుబాటులోకి రావడం వల్ల మందుల నాణ్యత పకడ్బందీగా పరీక్షించేందుకు అవకాశం ఉంటుంది. అలాగే మందులు తయారుచేసే కంపెనీలు టెస్టింగ్ కోసం ఇతర ప్రాంతాలకు పంపితే

... మిగతా 6వ పేజీలో

ఆర్పీఎఫ్ రిహార్సల్స్



విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించే విన్యాసాలకు సంబంధించి ప్రత్యేకంగా కేటాయించిన రైల్వే రక్షణ దళం సిబ్బంది మూడు రోజులుగా రైల్వే ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో సాధన చేస్తున్నారు. బుధవారం చేసిన మోటారు సైకిల్ విన్యాసాల సాధన ఆకట్టుకుంది. మరికొందరు ఆర్పీఎఫ్ సిబ్బందితోపాటు స్కౌట్స్ అండ్ గైడ్స్ వలంటీర్లు పెరేడ్, స్కూల్ విద్యార్థులు బ్యాండ్ సాధన చేశారు.

ఉత్సవాల పేరిట కాసుల వేట

ఆర్కే బీచ్ సమీపాన 14 ఎకరాల విస్తీర్ణంలో వినాయక ఉత్సవాల నిర్వహణకు భారీగా ఏర్పాట్లు

- 2 వేల కిలోల జర్మన్ సిల్వర్‌తో విగ్రహం... 6 ఎకరాల్లో పార్కింగ్...
- టికెట్ కొంటేనే దర్శనం...
- లులూ మాల్‌కు కేటాయించిన స్థలంలో నిర్వహణ

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక ఉత్సవాలను భారీగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయితే కొన్ని వ్యాపార దృక్పథంతో చేస్తున్నవి కావడం గమనార్హం. హైదరాబాద్‌లో ఖైరతాబాద్ గణపతిలా ఇక్కడ ఉచిత దర్శనం ఉండదు. డబ్బులు పెట్టి టిక్కెట్ కొంటేనే వినాయకుడిని చూడడానికి లోపలకు పంపుతారు. ఈ దోపిడీకి జిల్లా నాయకులు కొందరు వెన్నుదన్నుగా ఉండడం మరో విశేషం. విశాఖపట్నంలో లులూ మాల్‌కు ఆర్కే బీచ్ రోడ్డు సమీపాన 14 ఎకరాల స్థలాన్ని 99 ఏళ్ల లీజుకు



వినాయక ఉత్సవాలకు జరుగుతున్న ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలంలో వినాయక ఉత్సవాలు భారీగా నిర్వహించడానికి యూత్ ఐకాన్ అసోసియేషన్‌కు ఏపీఐఐసీ అధికారులు అనుమతి ఇచ్చారు. దేశమంతా వినాయక ఉత్సవాలను నవరాత్రులు (తొమ్మిది రోజులు) చేస్తే వీరు 21 రోజులు చేస్తామని

... మిగతా 6వ పేజీలో

'ఉక్కు' ఎస్ఎంఎస్-2లో రికార్డు ఉత్పత్తి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని స్టీల్ మెల్ట్‌షాప్ (ఎస్ఎంఎస్)-2 విభాగంలో రికార్డు స్థాయి ఉత్పత్తి జరిగింది. మంగళవారం ఉదయం ఆరు నుంచి బుధవారం ఉదయం ఆరు గంటల వరకూ...ఎ, బీ, సీ షిఫ్టుల్లో కలిపి 72 హీట్‌ల (పెద్ద సైజు కలిగిన ఇనుప దిమ్మలు) ఉత్పత్తి చేశారు. 2021 జనవరి 30న ఈ విభాగంలో అత్యధికంగా 68 హీట్‌ల ఉత్పత్తి జరిగింది. ఆ రికార్డును ఇప్పుడు అధిగమించి 72 హీట్‌లు ఉత్పత్తి చేశారు. ప్లాంటు విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసినప్పటి ఈ విభాగంలో ఇదే అత్యధిక ఉత్పత్తి. రికార్డు ఉత్పత్తి జరగడంతో విభాగం అధికారులు, ఉద్యోగులను యాజమాన్యం అభినందించింది.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

గణేశ్ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

మధురవాడ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 7వ వార్డు పరిధిలోని చంద్రంపాలెంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు యువకులు సన్నాహాలు చేస్తున్నారు. ఈమేరకు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఉత్సవ వేదిక వద్ద బుధవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా పర్యావరణహితంగా మట్టి గణపతితో ఉత్సవాలు చేస్తున్న కమిటీని అభినందించారు. ఈసారి 41 అడుగుల మట్టి వినాయక ప్రతిమను ఏర్పాటు చేయనున్నట్టు నిర్వాహకులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ కార్యక్రమంలో చంద్రంపాలెం గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు



స్వామివారికి గరుడ సేవ చేస్తున్న అర్చకులు

సింహాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామికి బుధవారం పలు ఆర్జిత సేవలను వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని, ఉభయ దేవేరులను సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. తొలుత నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ సహస్రనామ తులసీ దళార్చన జరిపారు. తరువాత గోవిందరాజస్వామిని రజిత గరుడ వాహనంపై ఉంచి పూజలు చేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం నిర్వహించారు.

అనిట్స్‌లో యువజన సమ్మేళనం

తగరపువలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సంగివలస అనిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం యువజన సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొ. వి. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించడానికి, వారిలో సృజనాత్మక కళలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. అందుకు 'ఈ రాన్' పేరులో కొత్తగా క్లబ్ ఏర్పాటు చేశామన్నారు. క్లబ్ నిర్వాహకురాలు డా. సత్యఫణికుమారి మాట్లాడుతూ విద్యార్థులకు నృత్య, సంగీత, సాహిత్య రంగాల్లో తర్ఫీదు ఇస్తున్నామని చెప్పారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు.

బీచ్ పార్కులో ఆట వస్తువులు ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన పరికరాలు

సాగర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రుషికొండ బీచ్‌లో ఉన్న పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు పలు పరికరాలు అమర్చారు. గతంలోనూ ఆట వస్తువులు ఏర్పాటు చేసినప్పటికీ అవి తుప్పు పట్టి పాడయ్యాయి. దీంతో బీచ్‌కు వచ్చే చిన్నారులు ఆట పరికరాలు లేక ఇబ్బందులు పడేవారు. ఈమేరకు జీవీఎంసీ అధికారులు రూ. 13 లక్షలతో కొత్తగా పరికరాలను ఏర్పాటు చేశారు.

డిగ్రీ కళాశాల అధ్యాపకులు నిరసన



కళాశాలలో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

భీమునిపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఎస్‌వీఎల్‌ఎన్‌ఎస్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తక్షణమే బదిలీలు నిర్వహించాలని, జీవో నంబరు 42 రద్దు చేయాలని, ఖాళీగా వున్న ప్రిన్సిపాల్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఈనెల 18న విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే ధర్నాకు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది తరలిరావాలని పిలుపునిచ్చారు.

సాగర్‌నగర్‌లో వెలగని వీధి లైట్లు



లైట్లు లేక ఓ వీధిలో చీకటి

సాగర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్ కాలనీలో పలు చోట్ల వీధి దీపాలు వెలగక అంధకారం నెలకొంది.ఎంఐజీ-డి, ఎల్‌ఐజీ-సి గృహ సముదాయాలు మధ్య ఉన్న రహదారిపై నెల రోజులుగా లైట్లు వెలగడం లేదు. దీంతో స్థానికులు చీకట్లోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. అసలే కాలనీలో దొంగల భయం ఎక్కువ. దీనికితోడు వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులు మరింత భయాందోళనకు గురవుతున్నారు. లైట్లు లేకపోవడంతో ఆరు బయట పార్కింగ్ చేసిన వాహనాల నుంచి చిల్లర దొంగలు పెట్రోలు, డీజిల్ దొంగతనం చేస్తున్నారు.

రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం

- ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు
- తగరపువలసలో రైతు సంబరం

తగరపువలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా అండగా ఉంటుందని, వారిలో చైతన్యం కలిగించడానికే ట్రాక్టరు ర్యాలీ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఆయన తగరపువలసలోని అంబేడ్కర్ కూడలిలో ట్రాక్టర్ ర్యాలీని ప్రారంభించారు. తగరపువలస, చిల్లపేట, రాయిపాలెం మీదుగా భీమిలి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ, కిసాన్‌యోజన కింద ప్రభుత్వం ప్రతి రైతుకు రూ. 20 వేలు పెట్టుబడి సాయం అందిస్తుందని చెప్పారు. అలాగే పంటలకు గిట్టుబాటు ధర, రాయితీపై విత్తనాలు, ఎరువులు సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతుల ఆత్మహత్యలు లేకుండా వ్యవసాయా న్ని లాభసాటిగా చేయడానికి పలు పథకాలు రూపొందిస్తుందన్నారు. అనంతరం భీమిలి, ఆనందరపురం, పద్మనాభం మండ లాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో భీమిలి జడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, నాయకులు రమేశ్, పిట్ట సురేశ్, దామోదరరావు, తదితరులు పాల్గొన్నారు.

గంటాను కలిసిన వేములవలస పీఏసీఎస్ అధ్యక్షుడు

ఆనందపురం : మండలంలోని వేములవలస పీఏసీఎస్ చైర్మన్ రౌతు నాగరాజు ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును బుధవా రం భీమిలిలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు అన్ని విధాలుగా అండగా ఉండి, వారి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు తమ్మిన అప్పలరాజు, నక్క శ్రీధర్, కోరుకొండ మూర్తి, బాలు, బొద్దపు గోవింద్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడిపి ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



ఆనందపురంలోని వేములవలసలో జాతీయ జెండా ప్రదర్శన



పద్మనాభంలో ర్యాలీని ప్రారంభిస్తున్న తహసీల్దారు ఆనందరావు

ఉత్సాహంగా 'తిరంగా' ర్యాలీ

తగరపువలస, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. జాతీయ జెండాలు పట్టుకుని చిట్టివలస, తగరపువలస ప్రాంతాల్లోని ఇంటింటికి తిరుగుతూ స్వాతంత్ర్య దినోత్సవం గురించి ప్రజలకు వివరించారు. ఆగస్టు 15న ఇళ్లపై జాతీయ జెండాలను ఎగరవేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీవాణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేములవలసలో...

ఆనందపురం : వేములవలస గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. వివేకానంద జూనియర్ కళాశాల, వెంకటేశ్వర స్కూల్ విద్యార్థులు వంద మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా బిజేపీ నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపుమేరకు ప్రతిఒక్కరూ ఇంటిపై ఆగస్టు 15న జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ విశాఖ జిల్లా కిషాన్ మోర్చ అధ్యక్షుడు ప్రసాదరావు పట్నాయక్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఉప్పాడ అప్పారావు, మండల అధ్యక్షురాలు పిల్లా విజయ, నాయకులు మీసాల రామునాయుడు, కేఎస్‌పీ చక్రవర్తి, వి.దక్షిణామూర్తి, కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బీచ్ రోడ్డులో...

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డులో బీజేపీ విశాఖ పార్లమెంట్ నియోజకవర్గం మహిళా మోర్చా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విశాలాక్షినగర్ బీవీకే కళాశాల నుంచి బీచ్ రోడ్డు మీదుగా కైలాసగిరి పోలీసు క్వార్టర్స్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా వార్డులోని స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్రపరిచారు. 79 ఏళ్లలో భారత్ సాధించిన పురోగతిని స్థానికులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఉమ్మడి పాల్‌రాజ్, అక్కరబోయిన రాంబాబు, వేజెళ్ల సుబ్బరాజు, వెంకట్రావు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ఫణీంద్ర, మహిళా మోర్చా నాయకులు లత, భారతి, సత్య, సుబ్బలక్ష్మి, వసంత, సీత పాల్గొన్నారు.

భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

భీమునిపట్నం : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. తొలుత కళాశాల ప్రిన్సిపాల్ పి. సురేఖ జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగ కార్యక్రమం ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు జాతీయ జెండా ప్రాధాన్యతను తెలియపరుస్తుందని చెప్పారు.

పద్మనాభంలో...

పద్మనాభం : పద్మనాభంలో సుమారు వెయ్యి మంది విద్యార్థులతో హర్ ఘర్ తిరంగా ర్యాలీ జరిగింది. ర్యాలీని తహసీల్దారు కె.ఆనందరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో వీరుల త్యాగాలను నేటి తరానికి తెలియజేయాలన్నారు. అనంతరం పద్మనాభం జంక్షన్ నుంచి కుంతీమాధవస్వామి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఎస్ఐ బి. గణేశ్, జాతీయ అవార్డు గ్రహీత రూపాకుల రవికుమార్, బీజేపీ మండల అధ్యక్షురాలు టి. నాగమణి, నాయకులు కృష్ణారావు, వెంకట్రావు, శ్రీనివాసరావు, మహేశ్, సోమేశ్, జైభరత్‌కుమార్, గౌరిరెడ్డి పాల్గొన్నారు.

'యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



ప్రతిజ్ఞ చేస్తున్న దేవస్థానం సిబ్బంది

సింహాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సింహాచలం దేవస్థానం భూ పరిరక్షణ విభాగం స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ గీతాంజలి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు బుధవారం సింహాచలం దేవస్థానం ఉద్యోగులు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. అలాగే దేవస్థానం ఆధీనంలో నడుస్తున్న హైస్కూల్ విద్యార్థులతో కూడా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈఓ సింగం రాధ, ఏఈఓ వి. రమణ మూర్తి, హైస్కూల్ హెచ్‌ఎం భాను, తదితరులు పాల్గొన్నారు.

వెంకటరమణ కుటుంబానికి ఆర్థిక సాయం

సింహాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అడివివరం సహకార పరపతి సంఘానికి చెందిన డైరెక్టర్ లండ వెంకట రమణ కుటుంబానికి సొసైటీ పాలకమండలి అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి, ఇతర డైరెక్టర్లు రూ.1.2 లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా అప్పలస్వామి మాట్లాడుతూ డైరెక్టర్ వెంకటరమణ గ్రామ దేవతల పూజారిగా అమూల్యమైన సేవలందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షుడు బంటుబిల్లి మహేశ్, డైరెక్టర్లు గునిశెట్టి శ్రీనివాసరావు, గొంతిన రామకృష్ణ ఆకుల నాగరాజు, మజ్జి ధర్మరాజు, కార్యదర్శి శివ, తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆధార్ సీడింగ్ చేయించుకోవాలి

పద్మనాభం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అన్నదాత సుఖీభవ పథకం పొందని రైతులు తమ గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రానికి వెళ్లి వ్యవసాయ సహాయకులను సంప్రతించి, తమ 1బీని ఆధార్‌తో సీడింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎంపీఎస్ చలం తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

తీరంలో పేరుకుపోతున్న వ్యర్థాలు

సాగర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం తీరంలో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. కొన్ని రోజులుగా సముద్రం అల్లకల్లోలంగా మారి కెరటాలు ఉధృతంగా తీరాలను తాకుతుండడంతో వ్యర్థాలు కొట్టుకువస్తున్నాయి. దీంతో ఆ ప్రాంతాల్లో దుర్గంధం నెలకొంటోంది. బీచ్‌కు వస్తున్న సందర్శకులు ఇబ్బందులకు గురవుతున్నారు. కెరటాలు ఇసుక తెన్నులు దాటి ముందుకు వస్తుండడంతో బీచ్ క్లీనింగ్ నిర్వహించే యంత్రాలు కనిపించడం లేదు. కెరటాల ఉధృతి తగ్గితే తప్ప బీచ్ క్లీనింగ్‌కు వీలుపడని పరిస్థితి నెలకొంది.

గెడ్డ ప్రవాహానికి ఇసుక మేట అడ్డంకి

సముద్రం పోటు మీద ఉండడంతో సాగర్‌నగర్ ఉత్తరాన ప్రవహించే గెడ్డ నీరు నిలిచిపోయింది.దీంతో గెడ్డ ప్రాంతం ముంపునకు గురవుతోంది. బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ వద్ద ఉన్న కల్వర్టును గెడ్డలో నీటి ప్రవాహం తాకుతోంది. ఏ నిమిషంలోనైనా ప్రవాహం బీచ్ రోడ్డుపై నుంచి వెళ్లే ప్రమాదం వుంది. గెడ్డలో మురుగు నీరు నీరు చేరుతుండడంతో తీవ్రమైన దుర్గంధం నెలకొంది. దీంతో సాగర్‌నగర్ బీచ్‌కు వచ్చే సందర్శకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్య ఏటా వుండేదే. గెడ్డ, సముద్రం నీరు కలిసే చోట ఇసుక మేటను జీవీఎంసీ ఏటా ముందస్తుగా తొలగించేది. దీంతో గెడ్డ ప్రవాహానికి ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఈసారి ఇసుక మేటను తొలగించకపోవడంతో సమస్య నెలకొంది. ఏ ప్రమాదం జరగముందే గెడ్డ నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ఇసుక మేటలను తొలగించాలని తీర ప్రాంత వాసులు కోరుతున్నారు.



గుడ్లవానిపాలెం తీరానికి కొట్టుకువచ్చిన వ్యర్థాలు

గ్రామాల్లో తాగునీటికి దివీస్ సాయం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో రెండు గ్రామాల్లో వాటర్ ట్యాంకుల నిర్మాణానికి దివీస్ కంపెనీ యాజమాన్యం రూ. 4 లక్షలు వితరణగా అందజేసింది. పనులు చేపడుతున్న శారద ట్రస్టుకు చిప్పాడలోని దివీస్ కార్యాలయంలో కంపెనీ ప్రతినిధులు బుధవారం చెక్కు అందించారు. ఈనిధులతో బెడ్డుగూడ, కిన్నంగూడ గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాలు నిర్మించనున్నట్టు ట్రస్టు సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివీస్ కంపెనీ జనరల్ మేనేజర్ వైఎస్ కోటేశ్వరరావు, సామాజిక సేవా విభాగం మేనేజర్ డి. సురేశ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌పై అవగాహన ర్యాలీ

సాగర్‌నగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ర్యాగింగ్‌పై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. గీతం ప్రో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వై. గౌతమ్ రావు ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ర్యాగింగ్ నిరోధానికి నిర్దేశించిన చట్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె. నాగేంద్రప్రసాద్, గీతం ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీజీ రెడ్డి, పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

అనంత పద్మనాభుని ఆలయానికి ఇన్వర్టరు బహూకరణ

పద్మనాభం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభంలోని అనంత పద్మనాభుని ఆలయానికి రూ. 40 వేల విలువ గల ఇన్వర్టరును దాత బుధవారం బహూకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులు విద్యుత్ సరఫరా లేనప్పుడు ఎటువంటి అసౌకర్యానికి గురవ్వకుండా హైదరాబాద్‌కు చెందిన అమరాన్ బ్యాటరీ డిస్ట్రిబ్యూటరు కుమార్ దీన్ని ఏర్పాటు చేశారు.

ప్రాక్టికల్స్ నిర్వహణపై పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్యా కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబంధించి జరగనున్న ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షించేందుకు విశ్వసనీయత కలిగిన అబ్జర్వర్లను నియమించినట్టు కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల పేరుతో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై 'మారని ఏయూ తీరు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇప్పటికే ప్రక్షాళన చేపట్టామని, ప్రాక్టికల్స్ నిర్వహించే కళాశాలల సంఖ్యను తగ్గించామన్నారు. మరోసారి ఆయా కళాశాలలను పరిశీలిస్తామన్నారు. ప్రాక్టికల్స్ డిగ్రీ కళాశాలలోనే నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, ప్రభుత్వ కళాశాలల సంఖ్య పరిమిత కావడంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాక్టికల్స్‌ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఏయూ యాజమాన్యం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

జెండా పండుగకు విస్తృతంగా ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అశోక్

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న పోలీసు బేరక్స్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శకటాలు, స్టాల్స్ సిటింగ్ ఏర్పాట్లలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం వచ్చినా కార్యక్రమం నిర్వహణకు ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా విశాఖ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను మాదక ద్రవ్యాల రహి తంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నిషా ముక్త భారత్ అభి యాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజలు సమష్టిగా కృషి చేసి జిల్లాలో డ్రగ్స్‌ను నివారించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.

దాతలకే మస్కా!?

... 5వ పేజీ తరువాయి

ఇక్కడి నుంచి ఈఓ రిలీవ్ కావడం మరో విచిత్రం. ఆమె ఇటీవల రిటైర్ కావడం, అమెరికా వెళ్లిపోతుండడంతో ఎప్పుడు వస్తారో తెలియక...లెక్కలు తేల్చడానికి సిద్ధపడ్డారని తెలిసింది. 2021లో ఇదంతా జరిగిన తరువాత కాళింగరి శాంతి ఈఓగా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పనిచేశారు. సహజంగా ఆమె ఇలాంటి ఆభరణాల లెక్కల్లో కచ్చితంగా ఉంటారు. కానీ ఆమె కూడా ఈ విషయంలో ఎందుకనో మౌనం వహించారు. గత వారం ఈ లెక్కలు అప్పగింతకు వచ్చినప్పుడు ఆ కాగితాలపై సంతకాలు చేయడానికి ఆమె నిరాకరించారు. ఒకరి తరువాత మరొకరు పెట్టాల్సిందేనని అంతా చెప్పడంతో అయిష్టంగానే సంతకం చేశారు. అమెరికా వెళ్లిపోతున్న రిటైర్డ్ ఈఓ కూడా షాపింగ్‌మాల్ అధినేత ఎంత బరువైన తాపడం ఇచ్చారో సరిగ్గా లెక్క చెప్పకపోవడం వల్లనే రశీదు ఇవ్వలేదని వివరణ రాసి ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

కమిషనర్ నుంచే ఆదేశం

– ఎన్.సుజాత, డిప్యూటీ కమిషనర్

కనకమహాలక్ష్మి ఆలయంలో వెండి లెక్కలపై విచారణ చేయాలని నేరుగా దేవదాయ శాఖ కమిషనర్ నుంచే ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. పాత వెండి ఆభరణాలు ఇచ్చి, కొత్త వెండి ఆభరణాలు తీసుకోవడానికి కమిషనర్ అనుమతి తప్పనిసరి. ఉన్నతాధికారులకు తెలియజేయకుండా, కనీసం ఫైల్ కూడా పెట్టకుండా ఇంత పెద్దమొత్తంలో వెండికి రశీదులు లేకపోవడం విచిత్రంగా ఉంది. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని భావిస్తున్నాం.

ఉత్సవాల పేరిట కాసుల వేట

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఎవరైనా సరే మట్టి లేదా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహం చేస్తారు. వీరు మాత్రం జర్మన్ సిల్వర్‌తో తయారు చేస్తున్నారు. ఇది నీటిలో కరగదు. నిమజ్జనం చేయడానికి వీలు కాదు. ఈ విషయం పక్కనపెడితే అక్కడ 14 ఎకరాలు అందుబాటులో ఉండగా అందులో ఆరు ఎకరాలు కేవలం వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్టు ప్రకటించారు. అంటే ఏ సంఖ్యలో వాహనాలు వస్తాయో అర్థం చేసుకోవచ్చు. పార్కింగ్ ఫీజు కూడా ఉంటుంది. మరో రెండు ఎకరాల్లో ఫ్లవర్ షో పెడతామంటున్నారు. మిగిలిన స్థలంలో రకరకాల ఎగ్జిబిషన్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తారు. స్టాళ్లు అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలుచేస్తారు. ఇదంతా వ్యాపార దృక్పథంతో చేస్తున్నారు. ఉత్సవానికి సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు వెచ్చిస్తున్నారు. అంతకు రెట్టింపు ఆదాయం కేవలం నెల రోజుల్లో పొందాలనేది లక్ష్యం. దీనికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు, ఫొటోలు వాడుకుంటున్నారు. ఏపీఐఐసీ అధికారులు కూడా ఆ ఎమ్మెల్యేల సిఫారసుతోనే ఆ భూమిని ఉత్సవాలకు ఇచ్చారు. 14 ఎకరాలు నెల రోజులు వాడుకోవడానికి ఇస్తున్నందున దానికి తగ్గట్టుగా ఫీజు వసూలు చేయాలి. ఆ అసోసియేషన్ నుంచి ఎంత ఫీజు వసూలు చేశారని ప్రశ్నిస్తే ఏపీఐఐసీ అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. ఇలా వ్యాపార ధోరణితో ఉత్సవాలను నిర్వహించే వారిని నాయకులే ప్రోత్సహించడాన్ని హిందూ పరిషత్ వంటి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

స్త్రీశక్తికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

కూడా పెంచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే మహిళల సంఖ్య కూడా పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా సర్వీసులు కూడా పెంచుకోవలసిన అవసరం ఉంటుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. పథకం ప్రారంభమైన వారం రోజుల తరువాత రోజువారీ ప్రయాణించే మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు అందించడంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయ అధికారులు రీజియన్ అధికారులకు ఆదేశాలు జారీచేశారు.

అక్కరకు రాని ఆయుష్ ల్యాబ్!

... 5వ పేజీ తరువాయి

అదనపు ఖర్చు అవుతోంది. ల్యాబ్ అందుబాటులోకి వస్తే ఈ వ్యయం తగ్గుతుంది. తద్వారా రోగులపై భారం తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అదే సమయంలో సరికొత్త ఔషధాలు తయారీకి సంబంధించిన పరిశోధనలను ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఔషధ పరిశోధన నూతన ఫార్ములేషన్ల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఆయుర్వేద విద్యార్థులకు పరిశీలన, ప్రాక్టీస్ నిర్వహణకు కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు వీలైనంత తొందరగా టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

- ఎంవీపీ కాలనీ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక ఏర్పాటు
- గంజాయి, మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గంజాయి వినియోగం అధికమైంది. ఆకతాయి యువత గంజాయి కొనుగోలు చేసి బహిరంగంగానే సేవిస్తున్నారు. గంజాయి మత్తులో వీరంగం సృష్టించి స్థానికులు, ప్రయాణికులకు భయాభ్రాంతులకు గురి చేసే సంఘటనలు అనేకం ఉంటున్నాయి. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. నిర్మానుష్య ప్రాంతాల్లో అయితే ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయడానికి త్రీ టౌన్, ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బహిరంగంగా గంజాయి, మద్యం సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై డ్రోన్ సేవలు వినియోగిస్తున్నారు. ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవించే ప్రదేశాలు గుర్తించారు. మద్దిలపాలెం, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్, అప్పుఘర్ ప్రాంతాల్లో ప్రతి రోజూ పోలీసులు డ్రోన్ ఎగురవేసి పరిసరాలను క్షుణ్ణంగా క్షక్షపరిశీలిస్తున్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీచ్ రోడ్డు, రామ్‌నగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్లతో పహారా కాస్తున్నారు. ర్యాలీలు, ఆందోళనలు కార్యక్రమాలు సైతం డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు.


పెదాపురం కాలనీ రోడ్డులో డ్రోన్ ఎగురవేస్తున్న పోలీసులు


డ్రోన్ విజువల్స్‌ను చూస్తున్న కానిస్టేబుల్

డ్రోన్లపై ప్రత్యేక శిక్షణ..

త్రీటౌన్, ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్లకు ఒక్కో డ్రోన్ అందించారు. ఆయా డ్రోన్లను ఆపరేటింగ్ చేయడానికి పోలీస్‌స్టేషన్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు. ఒక్కో స్టేషన్‌లో అయిదుగురు సిబ్బందికి మూడు రోజుల పాటు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఒక్కో డ్రోన్ అరవై అడుగుల ఎత్తులో ఎగురుతూ రెండు కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. దీనివల్ల నిర్మానుష్య ప్రాంతాలను పరిశీలించడం సులువుగా ఉంటుంది. ఇప్పటికే పోలీసులు గుర్తించిన ఏరియాల్లో డ్రోన్‌లు ఎగురవేసి అక్కడ పరిస్థితి తెలుసుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు గమనిస్తే వెంటనే సిబ్బందికి సమాచారమిచ్చి చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా డ్రోన్ కెమెరాల ద్వారా ఫోటోలు, వీడియో రికార్డు చేసి పుటేజీని అధికారులకు పంపిస్తున్నారు. గతంలో తుప్పలు, గుట్టలుగా ఉన్న ప్రాంతాల్లో ఆకతాయిలు గంజాయి మద్యం సేవించేవారు. డ్రోన్ నిఘాతో అలాంటి ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలపాలకు చెక్ పెడుతున్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన- ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలో సామగ్రి, ఇతర పరికరాలను పరిశీలించాలని, ఇళ్లు అప్పగించే ముందు స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఇప్పటికీ నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారుల విషయంలో గ్రామసభ తీర్మానాలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనల మేరకు పట్టాలు రద్దుచేసి అర్హులకు అందించాలన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జీవీఎంసీ కాంట్రాక్టర్ల క్రీడా పోటీలు


పోటీలో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కాంట్రాక్టర్ల సంఘం నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం సభ్యులు ప్రతిభను ప్రదర్శించారు. చెస్‌లో వి.రామకృష్ణ, కాల సుధాకర్, క్యారమ్స్‌లో ఎలమంచిలి రమేష్, మద్దాల రమేష్, బ్యాడ్మింటన్‌లో వి.రామకృష్ణ, చక్రవర్తి విజేతలుగా నిలిచారు. క్రికెట్‌లో ఎస్‌వి. రామయ్య ఎలెవెన్, గాజువాక ఎలెవెన్ జట్లు రెండు స్థానాలను సాధించాయి. బుధవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, కోశాధికారి సిరికి శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ కన్‌స్ట్రక్షన్స్ అప్పలరాజు, కె.నారాయణరావు, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో కానరాని అభివృద్ధి : సీపీఐ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్కే కుమార్, సీపీఐ నేతలు

ఆరిలోవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ విశాఖ నగరం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ విమర్శించారు. బుధవారం ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ర 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర మహాసభలలో విశాఖపట్నం జిల్లా సమగ్రాభివృద్ధిపై పార్టీ చేపట్టాల్సిన చర్యలను చర్చించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం చేయాల్సిన పోరాటాల గురించి చర్చిస్తామన్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయిందని మండిపడ్డారు. రూ.9.138 కోట్ల తో యుద్ధ ప్రాతిపదికన జోనల్ కార్యకలాపాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నగరంలో గూడులేని పేద ప్రజలను గుర్తించి వారికి తక్షణమే రెండు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఆరిలోవలో అన్ని డిస్పెన్సరీల్లో వైద్యులను నియమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు దేవుడమ్మ, సీహెచ్ కాసుబాబు, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, రాము, బి.పుష్ప కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై ఎమ్మెల్యేకు వివరాలు


ఎమ్మెల్యే వెలగపూడిని కలసిన అధికారులు సత్యపద్మ, కనకమహాలక్ష్మి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శి వంటి విషయాలను వివరించడానికి ఎమ్మెల్యే వెలపూడి రామకృష్ణబాబును బుధవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం ప్రత్యేక అధికారి ఎం.సత్యపద్మ, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మీ కలిశారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. పీ4 సర్వే వివరాలను తెలిపారు. వివిధ మార్గాల్లో మార్గదర్శకుల వివరాలను సేకరిస్తున్నట్టు వెల్లడించారు.

కేజీహెచ్‌లో రక్త పరీక్షలకు ఇక్కట్లు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రెండు రోజులుగా కొన్ని రకాల రక్త పరీక్షలు జరగడం లేదు. పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లో అవసర మైన రీ ఏజెంట్స్ (కొన్ని రకాల కెమికల్స్) అందుబాటులో లేకపోవడంతోపాటు బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వ హించే పరికరం బ్రేక్‌డౌన్ అయింది. అత్యంత కీలకమైన ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు జర గకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొన్నిరకాల శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఈ పరీక్ష లు అవసరం. దీంతో సుమారు 200 మంది వరకు రోగు లు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అత్యవసరమైన వారు బయట ల్యాబ్‌లలో చేయించుకోగా, మిగిలిన వారు ఎదురుచూస్తు న్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల ని కోరుతున్నారు.

'స్వాతంత్ర్య' సందడి


విక్రయానికి ఉంచిన జాతీయ జెండాలు

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా వివిధ ఆకారాలు కలిగిన జాతీయ జెండాల విక్రయం జోరుగా సాగుతోంది. ఇసుకతోట జాతీయ రహదారి పక్కన కృష్ణా మందిరం వద్ద స్టాళ్లను ఏర్పాటు చేసి వీటి విక్రయాన్ని సాగిస్తున్నారు. జేబుకు పెట్టుకునే జెండా నుంచి పోల్స్‌కి కట్టి ఎగురవేసే జెండాల వరకు ఇక్కడ విక్రయాలు సాగుతున్నాయి. రూ.10 నుంచి రూ.1000 లకు పైగా జెండాలను విక్రయిస్తున్నారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అభివృద్ధి కోసం రెవెన్యూ వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) పీఎం.సత్యవేణి, జోనల్ కమిషనర్లు, డీపీవో మనీషా త్రిపాఠి, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిలను ఆగస్టు 31 నాటికి 100 శాతం వసూలు చేయాలని, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులను 60 శాతం ఆగస్టు 31 నాటికి వసూలు చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించి ఆస్తి పన్నులు విధించలేనివి, అలాగే ఆస్తి పన్నులు విధించవలసిన ఆస్తులను వెంటనే గుర్తించడంతో పాటు తాగునీటి కనెక్షన్ ఉంటే వారి ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. ఆగస్టు 20 నాటికి పరిశీలించిన ఆస్తుల వివరాలను నివేదించాలన్నారు. ఆస్తి పన్నుల ఆస్తుల గుర్తింపు చర్యలలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులకు 24 గంటల్లో ఆస్తి పన్నుల విధింపునకు సర్వే నిర్వహణపై సమావేశం నిర్వహించి అసెస్మెంట్‌లు వేసే విధానంపై అవగాహనను కల్పించాలన్నారు. ఆస్తిపన్ను మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి వసూలుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంస్థ చెల్లించవలసిన ఆస్తి పన్నులను రెండు వారాలలో వసూలు చేసే విధంగా చూడాలని జోనల్ కమిషనర్లు, డీపీవో మనీషా త్రిపాఠిని ఆదేశించారు. జీవీఎంసీ దుకాణాలు, వాణిజ్య సముదాయాల అద్దెలు, ఆశీలు, మార్కెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్ణీత సమయంలో వసూళ్లు జరిపేలా చూడాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాలలో నివాసము లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి వారికి కేటాయించిన గృహాలను రద్దు చేయుటకు నివేదిక సిద్ధం చేశామని, ఇంకొంత మంది లబ్ధిదారులను గుర్తించవలసి ఉన్నదని కమిషనర్‌కు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టరు పీఎం సత్యవేణి తెలియపరిచారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మిగిలిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి గృహాలను రద్దు చేయుటకు వెంటనే చర్యలు చేపట్టి నివేదికను సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్లకు కమిషనరు ఆదేశించారు.

జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

- కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి



వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఒకటి, రెండు రాష్ట్రాల్లో జరిగిన ఉదాహరణ తీసుకున్నారని, ఈసీపై చేస్తున్న పోరాటంలో దేశ వ్యాప్తంగా జరిగిన ఓటు చోరీపై విచారణ చేయాలనేది కాంగ్రెస్ డిమాండ్ అని ఆమె పేర్కొన్నారు. రాహుల్ పోరాటానికి దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయని, వైసీపీ ఎందుకు మద్దతు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్ని పార్టీ సమావేశాల్లో చంద్రబాబు,కూటమి పార్టీలపై మాట్లాడారని, సందేహం ఉంటే తమ సొంత పత్రిక విలేకరులను పార్టీ సమావేశాలకు పంపించి ఉండవలసిందని ప్రియాంక దండి పేర్కొన్నారు. ఈసీకి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46,దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

మాదకద్రవ్య రహిత సమాజం కావాలి

- విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు


ప్రతిజ్ఞ చేస్తున్న పోర్టు అథారిటీ అధికారులు, ఉద్యోగులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య వ్యసన రహిత, ఆరోగ్యవంతమైన భారత దేశనిర్మాణానికి విశాఖపోర్టు అథారిటీ కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రభుత్వాలు చేస్తున్న జాతీయస్థాయి ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందిస్తుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. కేంద్ర సామాజిక న్యాయ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మాదకద్రవ్య రహిత భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ సాంభమూర్తి ఆడిటోరియంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించింది. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ సీఈఎంఎస్, ఐఎంయూ విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోర్టు అథారిటీవిభాగాధిపతులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామనిప్రతిజ్ఞచేశారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.జయ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన నషా ముక్తభారత్ అభియాన్ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలో మాదకద్రవ్యాల వినియోగం అధికమవుతోందన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తే కొంత సమాజమైన మారుతుందన్నారు. అనంతరం డ్రగ్స్ నష్టాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు గోపాలనాయుడు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాలిథిన్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు


చేపల వ్యాపారుల వద్ద జరిమానా వసూలు చేస్తున్న శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు హెచ్చరించారు.

బుధవారం హెచ్‌బీ కాలనీ ప్రాంతంలోని చేపల వ్యాపారులు, సులభ్ కాంప్లెక్సు వద్ద నున్న టిఫిన్ దుకాణం వద్ద తనిఖీలు చేపట్టి పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న చేపల వ్యాపారులకు రూ.2 వేలు, టిఫిన్ దుకాణం వద్ద రూ.500, చిన్న చిన్న వ్యాపారుల వద్ద రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానాలు విధించారు. వారి వద్ద నున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి వాటిని వినియోగిస్తే ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సచివాలయం శానిటరీ సెక్రటరీలు శివ, సాంబమూర్తి, గౌతమి, శుభ్రం మేస్త్రి నమ్మి చిన్నరాజు, జి.రాజు, బంగారాజు తదితరులు ఉన్నారు.

వైసీపీ హయాంలోనే దళితులకు న్యాయం

- వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు


మాట్లాడుతున్న సుధాకర్‌బాబు, వేదికపై కేకే రాజు తదితరులు

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబును గద్దె దింపే వరకు నిద్రపోవద్దని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం, వైసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎస్సీ విభాగం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయంలోనే దళితులకు న్యాయం జరిగిందన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారానని వ్యాఖ్యానించిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో దళితులు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్టుగా అమలు చేసిన వ్యక్తి జగన్ అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం లేదని రెడ్‌బుక్ రాజ్యంగం అమలులో ఉందన్నారు. గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అన్ని కులాల కంటే దళితులే అధికంగా ఓటేశారన్నారు. దళితులకు జగన్ అన్ని విధాలుగా న్యాయం చేస్తారన్నారు. నగర అధ్యక్షుడు కెకె రాజు మాట్లాడుతూ దళితులకు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్లాలని ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, రవిబాబు, సమన్వయకర్తలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి

- చికిత్స అందిస్తున్న కేజీహెచ్ వైద్యులు



ఆరిలోవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో గల రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో గల బీచ్ సమీపంలోని తుప్పల వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పాయిజన్ తీసుకొని అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గురువారం సాయంత్రం సుమారు ఆరున్నర గంటలకు స్థానికులు గమనించి తమకు సమాచారం ఇచ్చినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. వెంటనే అతడిని 108 ద్వారా కేజీహెచ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలోనే ఉన్నాడని, ఎవరైనా అతడి బంధవులు, తెలిసిన వారు ఉంటే ఆరిలోవ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్రావణి

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పార్కు నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ నీహారిక, సచివాలయం కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఈపీడీసీఎల్ జోన్-2 మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో కేబుల్ తీగెల్ని నేల దిగువగా అమర్చే ప్రాజెక్టుని నగరంలో దశలవారీగా చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. 33 కేవీ, 11 కేవీకేబుల్స్‌ను ఈ పనుల్లో భూమి నుంచి అమర్చనున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. భూమి లోపల కేబుల్స్ అమర్చడం వల్ల విద్యుత్ వ్యవస్థ మరింత సురక్షితంగా మారుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా అందించే వెసులుబాటు భూగర్భ కేబుల్స్ ద్వారా సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డిప్యూటీ ఏఈ శివ సత్యనారాయణ, బీజేపీ నాయకులు సునీల్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపండి

- దళిత గిరిజన, ప్రజా సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకరరావు, పక్కన దళిత గిరిజన ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆస్పత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని, దళిత గిరిజన చేతి వృత్తిదారులపై భారాలు మోపవద్దు అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా విచ్చేసిన డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకరరావు మాట్లాడుతూ దళిత గిరిజన చేతి వృత్తిదారులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని, దీనికి అయ్యే ఖర్చు వినియోగదారులే భరించాలనడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన లోకేశ్‌బాబు ఇప్పుడు ఏమీ మాట్లాడక పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ వైటి దాస్, ఎంవి ప్రసాదరావు, రాంబాబు, వై. రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ

- విశ్వసనీయత కలిగిన అబ్జర్వర్లకు బాధ్యతలు
- దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ నాయుడు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్యా కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబంధించి జరగనున్న ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షించేందుకు విశ్వసనీయత కలిగిన అబ్జర్వర్లను నియమించినట్టు కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల పేరుతో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై 'మారని ఏయూ తీరు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇప్పటికే ప్రక్షాళన చేపట్టామని, ప్రాక్టికల్స్ నిర్వహించే కళాశా లల సంఖ్యను అనేక అంశాలను పరిశీలించి తగ్గించామన్నారు. మరోసారి ఆయా కళాశాలలను పరిశీలిస్తామన్నారు. ప్రాక్టికల్స్ డిగ్రీ కళాశాలలోనే నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, ప్రభుత్వ కళాశాలల సంఖ్య పరిమిత కావడంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాక్టికల్స్‌ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఏయూ యాజమాన్యం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు

- నిర్వహణ మరచిన జీవీఎంసీ
- సాంకేతిక కారణాలు చూపి తొలగించేందుకు యత్నం



ఎన్జీజీవోస్ కాలనీలో..

మాధవధార, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించాలని జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపులు (బోరువెల్స్) నిర్వహణ లేక నిరుపయోగంగా మిగిలాయి. ఇటీవలే వేసిన కొత్త బోర్లు కూడా అక్కరకు రాకుండా పోతున్నా జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించకోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేతిపంపులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్ ఎన్జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ బస్టాప్ వద్ద నివాసితుల కోసం వేసిన చేతిపంపు దారికి అడ్డంగా ఉందన్న కారణంగా ఓ బహుళ అంతస్థుల నిర్మాణదారుడు ఎలాగైనా దాన్ని తొలగించాలని చూస్తున్నారు. దాదాపు ఒక్కో చేతిపంపు అమరికకు ఏళ్ల క్రితమే రూ.70 వేల వరకు ఖర్చు చేసిన జీవీఎంసీ నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండిపోతోంది. చేతిపంపు వేశామా? ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేశామా? అంతవరకే అన్నట్టుగా ఆ శాఖ ఆలోచనగా కనిపిస్తోంది. తర్వాత కాలంలో అది పనిచేస్తుందా? అక్కడ అసలు చేతి పంపు ఉందా? లేదా? అన్న విషయమే పట్టించుకోవడం లేదు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్లు వస్తున్న తరుణంలోనూ పోటీ పడి ప్రజాప్రతినిధులు ఏదో విధంగా తమ వార్డు అభివృద్ధి నిధుల్ని ఖర్చు చేసేలా వేసిన చేతిపంపులు, ఇపుడు నిరాదరణకు గురయ్యాయి. తాగునీటి విభాగం అధికారులు నిత్యం బిజీగా గడిపేస్తుండటంతో వీటి నిర్వహణ, పనితీరు ఏ వార్డులోనూ సక్రమంగా లేదు. జీవీఎంసీ 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ ఎదుట మరో చేతిపంపు ఇపుడు 60 అడుగుల దారి విస్తరణకు ఆటంకంగా మారిందని, తొలగించే ఆలోచనలో ఉన్నారు. తొలుత ఏర్పాటు చేస్తున్నపుడు చేతిపంపు ఎక్కడ వేయాలన్న ప్రణాళిక ఉండదు. తీరా ఇపుడు దారికి అడ్డమని, నిరుపయోగమని కారణాలు చూపి ఎడాపెడా తొలగించడానికి సాకులు వెతుకుతున్నారు. మరమ్మతులకు గురైన చేతి పంపులను బాగు చేస్తున్న సందర్భాలు తక్కువే. జీవీఎంసీ 50వ వార్డు సీతన్నగార్డెన్స్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. పని చేయని చేతిపంపు పక్కనే కార్పొరేటర్ వి.ప్రసాద్ రెండేళ్ల క్రితమే మరో కొత్త చేతిపంపును ఏర్పాటు వేయించారు.పాతబోరింగ్ ఊసే పట్టించుకోలేదు. వీటిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళా కళాశాలలో హర్ ఘర్ తిరంగా



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం 'ప్రతి ఇంటికి జాతీయ జెండా' నినాదంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి దేశభక్తి నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ దేశభక్తిని చాటే హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా ఉన్నతి, ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కెఎల్ శిరీష, అధ్యాపకులు ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.అనూష, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ చిత్రాలన్నీ ఆణిముత్యాలే..

- వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ సినీ దర్శకుల్లో మేటి దర్శకుడు హిచ్‌కాక్ 126వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హిచ్‌కాక్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 18వ శతాబ్దం చివరిలో 19వ శతాబ్దపు ప్రారంభంలో తన చిత్రాల ద్వారా సందేశాన్ని కాకుండా కామెడీ, సస్పెన్స్, థ్రిల్లింగ్ చూపించడంలో ఆయనకు ఎవ్వరూ సాటిరారన్నారు. ఆయనను నేటి తరానికి మార్గదర్శకులుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 1059లో ఆయన దర్శకత్వంలో రూపొందించిన ఇంగ్లీష్ చిత్రం నార్త్ బై నార్త్ వెస్ట్ చిత్రాన్ని ప్రదర్శించారు.



హిచ్‌కాక్‌కు నివాళి అర్పిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

రైల్వే ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు



.ప్రతిభా పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో చిత్తశుద్ధితో ఆదర్శప్రాయ సేవలందించిన రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం తన కార్యాలయంలో పురస్కారాలు అందించి అభినందించారు. స్టేషన్లు, లోకో షెడ్లు, ఇతర రైలు కార్యకలాపాలలో క్లిష్ట పరిస్థితులను విజయవంతంగా అధిగమించిన కమ్మూరు స్టేషన్ మాస్టర్ మహేంద్ర సింగ్ చౌదరి, సీనియర్ రైలు మేనేజర్ (పాసింజర్) ఆర్.వెంకటరమణ, సీనియర్ రైలు మేనేజర్లు (గూడ్స్) చలుమూరి రమణనాయుడు, కె.శ్రీనివాసరావు, లోకో పైలట్లు తమ్మినేని దుర్గారావు, కె.రామకృష్ణ, అసిస్టెంట్ లోకో పైలట్ వై.హనుమంతరావు, టెక్నీషియన్లు జుర్ సింగ్, బింబాధర్ బారిక్‌లకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇశాంతరాం, సీనియర్ డీఎస్వో ఎం.కె.సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

- విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు

కంచరపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని జీవీఎంసీ ఆర్పీపేట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బి.సత్యవతి పేర్కొన్నారు. నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వకార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పద్మావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

స్త్రీశక్తికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

కూడా పెంచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే మహిళల సంఖ్య కూడా పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా సర్వీసులు కూడా పెంచుకోవలసిన అవసరం ఉంటుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. పథకం ప్రారంభమైన వారం రోజుల తరువాత రోజువారీ ప్రయాణించే మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు అందించడంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయ అధికారులు రీజియన్ అధికారులకు ఆదేశాలుజారీచేశారు.

అక్కరకు రాని ఆయుష్ ల్యాబ్!

... 5వ పేజీ తరువాయి

అదనపు ఖర్చు అవుతోంది. ల్యాబ్ అందుబాటులోకి వస్తే ఈ వ్యయం తగ్గుతుది. తద్వారా రోగులపై భారం తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అదే సమయంలో సరికొత్త ఔషధాలు తయారీకి సంబంధించిన పరిశోధనలను ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఔషధ పరిశోధన నూతన ఫార్ములేషన్ల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఆయుర్వేద విద్యార్థులకు పరిశీలన, ప్రాక్టీస్ నిర్వహణకు కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు వీలైనంత తొందరగా టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉత్సవాల పేరిట కాసుల వేట

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఎవరైనా సరే మట్టి లేదా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహం చేస్తారు. వీరు మాత్రం జర్మన్ సిల్వర్‌తో తయారు చేస్తున్నారు. ఇది నీటిలో కరగదు. నిమజ్జనం చేయడానికి వీలు కాదు. ఈ విషయం పక్కనపెడితే అక్కడ 14 ఎకరాలు అందుబాటులో ఉండగా అందులో ఆరు ఎకరాలు కేవలం వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్టు ప్రకటించారు. అంటే ఏ సంఖ్యలో వాహనాలు వస్తాయో అర్థం చేసుకోవచ్చు. పార్కింగ్ ఫీజు కూడా ఉంటుంది. మరో రెండు ఎకరాల్లో ఫ్లవర్ షో పెడతామంటున్నారు. మిగిలిన స్థలంలో రకరకాల ఎగ్జిబిషన్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తారు. స్టాళ్ల అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలుచేస్తారు. ఇదంతా వ్యాపార దృక్పథంతో చేస్తున్నారు. ఉత్సవానికి సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు వెచ్చిస్తున్నారు. అంతకు రెట్టింపు ఆదాయం కేవలం నెల రోజుల్లో పొందాలనేది లక్ష్యం. దీనికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు, ఫొటోలు వాడుకుంటున్నారు. ఏపీఐఐసీ అధికారులు కూడా ఆ ఎమ్మెల్యేల సిఫారసుతోనే ఆ భూమిని ఉత్సవాలకు ఇచ్చారు. 14 ఎకరాలు నెల రోజులు వాడుకోవడానికి ఇస్తున్నందున దానికి తగ్గట్టుగా ఫీజు వసూలు చేయాలి. ఆ అసోసియేషన్ నుంచి ఎంత ఫీజు వసూలు చేశారని ప్రశ్నిస్తే ఏపీఐఐసీ అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. ఇలా వ్యాపార ధోరణితో ఉత్సవాలను నిర్వహించే వారిని నాయకులే ప్రోత్సహించడాన్ని హిందూ పరిషత్ వంటి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

దాతలకే మస్కా!?

... 5వ పేజీ తరువాయి

ఇక్కడి నుంచి ఈఓ రిలీవ్ కావడం మరో విచిత్రం. ఆమె ఇటీవల రిటైర్ కావడం, అమెరికా వెళ్లిపోతుండడంతో ఎప్పుడు వస్తారో తెలియక...లెక్కలు తేల్చడానికి సిద్ధపడ్డారని తెలిసింది. 2021లో ఇదంతా జరిగిన తరువాత కాళింగరి శాంతి ఈఓగా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పనిచేశారు. సహజంగా ఆమె ఇలాంటి ఆభరణాల లెక్కల్లో కచ్చితంగా ఉంటారు. కానీ ఆమె కూడా ఈ విషయంలో ఎందుకనో మౌనం వహించారు. గత వారం ఈ లెక్కలు అప్పగింతకు వచ్చినప్పుడు ఆ కాగితాలపై సంతకాలు చేయడానికి ఆమె నిరాకరించారు. ఒకరి తరువాత మరొకరు పెట్టాల్సిందేనని అంతా చెప్పడంతో అయిష్టంగానే సంతకం చేశారు. అమెరికా వెళ్లిపోతున్న రిటైర్డ్ ఈవో కూడా షాపింగ్‌మాల్ అధినేత ఎంత బరువైన తాపడం ఇచ్చారో సరిగ్గా లెక్క చెప్పకపోవడం వల్లనే రశీదు ఇవ్వలేదని వివరణ రాసి ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

కమిషనర్ నుంచే ఆదేశం

- ఎన్.సుజాత, డిప్యూటీ కమిషనర్

కనకమహాలక్ష్మి ఆలయంలో వెండి లెక్కలపై విచారణ చేయాలని నేరుగా దేవదాయ శాఖ కమిషనర్ నుంచే ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. పాత వెండి ఆభరణాలు ఇచ్చి, కొత్త వెండి ఆభరణాలు తీసుకోవడానికి కమిషనర్ అనుమతి తప్పనిసరి. ఉన్నతాధికారులకు తెలియజేయకుండా, కనీసం ఫైల్ కూడా పెట్టకుండా ఇంత పెద్దమొత్తంలో వెండికి రశీదులు లేకపోవడం విచిత్రంగా ఉంది. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని భావిస్తున్నాం.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా విశాఖ

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, యువత సమష్టిగా కృషి చేసి జిల్లాలో డ్రగ్స్‌ను నివారించాలన్నారు. అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.

కేజీహెచ్‌లో పునఃప్రారంభంకానున్న గుండె శస్త్ర చికిత్సలు

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో త్వరలోనే శస్త్ర చికిత్సలు పునఃప్రారంభం కానున్నాయి. హార్ట్ లంగ్స్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్లు పని చేయకపోవడంతో ఎనిమిది నెలలుగా ఈ విభాగంలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. దీంతో అనేక మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడం, రాజకీయ పార్టీలు కూడా ఆందోళనలు చేపట్టడంతో అధికారులు స్పందించారు, శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాలను తీసుకువచ్చారు. బుధవారం రెండు పరికరాలు కేజీహెచ్‌కు చేరుకున్నాయి, ఆపరేషన్ థియేటర్‌లో వాటిని ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు. శనివారం నుంచి శస్త్ర చికిత్సలను పునఃప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తెలిపారు.

అలరించిన గాత్ర కచేరి

డాబాగార్డెన్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతిని చాటి చెప్పేది కళలేనని, అటువంటి కళలను కాపాడుకోవాలని సంగీత ప్రముఖులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఆ సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని జి. శారద సుబ్రహ్మణ్యంతో బుధవారం గాత్రకచేరి నిర్వహించారు. త్యాగరాజస్వామి సంకీర్తనలు, శ్రీకృష్ణ సంకీర్తనలు, ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనలను శ్రావ్యంగా గానం చేశారు. అనంతరం నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి చైర్మన్ ఏ. వెంకట్రావు, కార్యదర్శి పి. జగన్‌మోహనరావు, సంయుక్త కార్యదర్శి వి. మధుసూదనరావు, ఎం. నాగేశ్వరరావు, ఎం. మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

జ్ఞానాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వస్త్ర వనం పేరుతో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో నిర్వహించారు.ప్రదర్శనలో కాస్ట్యూమ్స్ ఆఫ్ ఇండియా,వింటేజ్ బ్లాక్ ప్రింటింగ్, అలాగే దేశం నలుమూలలు నుంచి సేకరించిన విభిన్న రకాల చీరలను ఉంచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ డా. షైజీ, అధ్యాపకులు సోని, గాయత్రి, శ్రీజ పాల్గొన్నారు.

కేవీలో ముగిసిన క్యాంపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో జరుగుతున్న హీరక్ పంక్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈమేరకు నాట్స్, వాటి ప్రాధాన్యత, కిట్ ఇన్‌స్పెక్షన్, యూనిఫారం తనిఖీ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బోర్ సింగ్ శిక్షకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

జెండా పండుగకు విస్తృత ఏర్పాట్లు

- జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అశోక్

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు, ఆగస్టు 15న పోలీసు బేరక్స్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శకటాలు, స్టాల్స్ సిటింగ్ ఏర్పాట్లలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం వచ్చినా కార్యక్రమం నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, వీఎంఆర్‌డీఏ, విద్యా, వైద్యారోగ్య, గృహ నిర్మాణ, పర్యాటక, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. మత్స్యశాఖ, డీఆర్‌డీఏ ప్రాథమిక రంగాలకు చెందిన శాఖలు యూసీడీ, సహకార శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాలి

- సదస్సులో సాహితీవేత్తలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

డాబాగార్డెన్స్ ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాల్సిన అవసరం ఉందని పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.ఇటీవల జమ్ము కశ్మీర్ చరిత్ర, సమస్యలపై ఇతివృత్తంగా వెలువడిన 25 పుస్తకాలను ప్రభుత్వం నిషేధించడం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా భావించాలన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఆధ్వర్యంలో 'భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం' అన్న అంశంపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పుస్తకాలను నిషేధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇటువంటి సమయంలో మేధావులు గొంతెత్తవలసిన అవసరం ఉందన్నారు. యూపీఎస్సీ మాజీ సభ్యుడు కేఎస్ చలం మాట్లాడుతూ ఆంగ్ల పుస్తకాల ముద్రణలో కష్టాలను వివరిస్తూ, అలాంటి పుస్తకాలను నిషేధించడం దారుణమన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాలన్నారు. రచయితలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉండాలని చెప్పారు. సమతా సాహితీ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కశ్మీర్‌ను ఆదరించిన ప్రభుత్వాలు, పుస్తకాలను నిషేధించడం సరికాదన్నారు.సాహితీవేత్త మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ రచనల్లో అబద్ధాలు ఉంటే నిషేధించరని, నిజమైన రచనలను నిషేధిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సాహతీ స్రవంతి అధ్యక్షుడు పి. ఫ్రాన్సిస్, అమరావతి విశ్వసాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ, కేవీఎస్ మూర్తి, పరమేశ్వరరావు, పతివాడ నాస్తిక్, ఎం. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వర్షం కవితల ప్రసంగం



మాట్లాడుతున్న కవి హనుమంతరావు

సీతంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్ర నగర్‌లో ఉన్న ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో వర్షంపై వివిధ కవుల వర్ణనపై కవితల ప్రసంగం బుధవారం అద్భుతంగా సాగింది. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవి, రచయిత, అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వివిధ కవుల కవితా స్పందనలను చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డివి సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, డాక్టర్ సూరపనేని విజయకుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, బి. రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పునీతపేతురు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్

జ్ఞానాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :పునీతపేతురు దేవాలయం వద్ద జరగుతున్న దేవమాత మోక్షారోపణ మహోత్సవాల్లో భాగంగా విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా బలహీనులకు బలం తల్లి అన్న అంశంపై ఫాదర్ బి. మనోజ్ కుమార్ ప్రసంగించారు. అనంతరం ఉత్సవ తేరును సెబాస్టియన్ కాలనీ, బిషప్ కె. మరియాదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎస్. విమల్రాజ్, వై. ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్ నిఘా

- ఎంవీపీ కాలనీ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక ఏర్పాటు
- గంజాయి, మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్ట


పిఠాపురం కాలనీ రోడ్డులో డ్రోన్ ఎగురవేస్తున్న పోలీసులు


డ్రోన్ విజువల్స్‌ను చూస్తున్న కానిస్టేబుల్

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : నగరంలో గంజాయి వినియోగం అధికమైంది. ఆకతాయి యువత గంజాయి కొనుగోలు చేసి బహిరంగంగానే సేవిస్తున్నారు. గంజాయి మత్తులో వీరంగం సృష్టించి స్థానికులు, ప్రయాణికులకు భయాబ్రాంతులకు గురి చేసే సంఘటనలు అనేకం ఉంటున్నాయి. అంతేకాకుండా బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ మందుబాబుల ఆగడాలు మితిమీరుతున్నాయి. నిర్మానుష్య ప్రాంతాల్లో అయితే ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారు. ఇలాంటి అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకట్ట వేయడానికి త్రీ టౌన్, ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బహిరంగంగా గంజాయి, మద్యం సేవించడం, పేకాట, ఈవ్ టీజింగ్, చైన్ స్నాచింగ్ వంటి నేరాలపై డ్రోన్ సేవలు వినియోగిస్తున్నారు. ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి సేవించే ప్రదేశాలు గుర్తించారు. మద్దిలపాలెం, స్టీల్‌ప్లాంట్ క్వార్టర్స్, అప్పుఘర్ ప్రాంతాల్లో ప్రతి రోజూ పోలీసులు డ్రోన్ ఎగురవేసి పరిసరాలను క్షుణ్ణంగా క్షక్షపరిశీలిస్తున్నారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బీచ్ రోడ్డు, రామ్‌నగర్, అమర్‌నగర్ తదితర ప్రాంతాల్లో డ్రోన్లతో పహారా కాస్తున్నారు. ర్యాలీలు, ఆందోళనలు కార్యక్రమాలు సైతం డ్రోన్లతో పర్యవేక్షిస్తున్నారు.

డ్రోన్లపై ప్రత్యేక శిక్షణ..

త్రీటౌన్, ఎంవీపీ కాలనీ పోలీస్‌స్టేషన్లకు ఒక్కో డ్రోన్ అందించారు. ఆయా డ్రోన్లను ఆపరేటింగ్ చేయడానికి పోలీస్‌స్టేషన్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందించారు. ఒక్కో స్టేషన్‌లో అయిదుగురు సిబ్బందికి మూడు రోజుల పాటు డ్రోన్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఒక్కో డ్రోన్ అరవై అడుగుల ఎత్తులో ఎగురుతూ రెండు కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది. దీనివల్ల నిర్మానుష్య ప్రాంతాలను పరిశీలించడం సులువుగా ఉంటుంది. ఇప్పటికే పోలీసులు గుర్తించిన ఏరియాల్లో డ్రోన్‌లు ఎగురవేసి అక్కడ పరిస్థితి తెలుసుకుంటున్నారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్టు గమనిస్తే వెంటనే సిబ్బందికి సమాచారమిచ్చి చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా డ్రోన్ కెమెరాల ద్వారా ఫోటోలు, వీడియో రికార్డు చేసి ఫుటేజీని అధికారులకు పంపిస్తున్నారు. గతంలో తుప్పలు, గుట్టలుగా ఉన్న ప్రాంతాల్లో ఆకతాయిలు గంజాయి మద్యం సేవించేవారు. డ్రోన్ నిఘాతో అలాంటి ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలపాలకు చెక్ పెడుతున్నారు.

ఉత్సాహంగా జీవీఎంసీ కాంట్రాక్టర్ల క్రీడా పోటీలు


పోటీలో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గ్రేటర్ విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) కాంట్రాక్టర్ల సంఘం నిర్వహించిన క్రీడా పోటీలు ఉత్సాహంగా జరిగాయి. క్రికెట్, చెస్, క్యారమ్స్, బ్యాడ్మింటన్ పోటీల్లో జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం సభ్యులు ప్రతిభను ప్రదర్శించారు. చెస్‌లో వి.రామకృష్ణ, కాల సుధాకర్, క్యారమ్స్‌లో ఎలమంచిలి రమేష్, మద్దాల రమేష్, బ్యాట్మింటన్‌లో వి.రామకృష్ణ, చక్రవర్తి విజేతలుగా నిలిచారు. క్రికెట్‌లో ఎస్‌వి. రామయ్య ఎలెవెన్, గాజువాక ఎలెవెన్ జట్లు రెండు స్థానాలను సాధించాయి. బుధవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో జీవీఎంసీ కాంట్రాక్టర్ల సంఘం అధ్యక్షుడు పీవీవీ నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.సంజీవరెడ్డి, కోశాధికారి సిరికి శ్రీనివాసరావు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ కనస్ట్రక్షన్స్ అప్పలరాజు, కె.నారాయణరావు, జి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో కానరాని అభివృద్ధి : సీపీఐ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్కే కుమార్, సీపీఐ నేతలు

ఆరిలోవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినప్పటికీ విశాఖ నగరం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి ఎస్కే రెహమాన్ విమర్శించారు. బుధవారం ఆరిలోవ అంబేడ్కర్ జంక్షన్‌లో సీపీఐ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలు నగరంలో ఈ నెల 23 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్ర మహాసభలలో విశాఖపట్నం జిల్లా సమగ్రాభివృద్ధిపై పార్టీ చేపట్టాల్సిన చర్యలను చర్చించనున్నట్టు తెలిపారు. ఇందుకోసం చేయాల్సిన పోరాటాల గురించి చర్చిస్తామన్నారు. విశాఖపట్నం రైల్వే జోన్ పనుల్లో ఎటువంటి పురోగతి లేకుండా పోయిందని మండిపడ్డారు. రూ.9.138 కోట్ల తో యుద్ధ ప్రాతిపదికన జోనల్ కార్యకలాపాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. నగరంలో గూడులేని పేద ప్రజలను గుర్తించి వారికి తక్షణమే రెండు సెంట్ల స్థలంలో ఇల్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.. ఆరిలోవలో అన్ని డిస్పెన్సరీల్లో వైద్యులను నియమించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు దేవుడమ్మ, సీహెచ్ కాసు బాబు, ఆరిలోవ ఏరియా కార్యదర్శి కె.లక్ష్మణరావు, రాము, బి.పుష్ప కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

'స్వాతంత్ర్య' సందడి


విక్రయానికి ఉంచిన జాతీయ జెండాలు

వెంకోజీపాలెం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గత మూడు రోజులుగా వివిధ ఆకారాలు కలిగిన జాతీయ జెండాల విక్రయం జోరుగా సాగుతోంది. ఇసుకతోట జాతీయ రహదారి పక్కన కృష్ణా మందిరం వద్ద స్టాళ్లను ఏర్పాటు చేసి వీటి విక్రయాన్ని సాగిస్తున్నారు. జేబుకు పెట్టుకునే జెండా నుంచి పోల్స్‌కి కట్టి ఎగురవేసే జెండాల వరకు ఇక్కడ విక్రయాలు సాగుతున్నాయి. రూ.10 నుంచి రూ.1000 లకు పైగా జెండాలను విక్రయిస్తున్నారు.

రెవెన్యూ వసూళ్లపై దృష్టి సారించండి

- అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అభివృద్ధి కోసం రెవెన్యూ వసూళ్లపై అధికారులు దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశించారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి, డీసీ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు, ప్రాజెక్టు డైరెక్టర్ (యూసీడీ) పీఎం.సత్యవేణి, జోనల్ కమిషనర్లు, డీపీవో మనీషా త్రిపాఠి, రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తో పాటు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ఆస్తి పన్ను బకాయిలను ఆగస్టు 31 నాటికి 100 శాతం వసూలు చేయాలని, 2025-26 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులను 60 శాతం ఆగస్టు 31 నాటికి వసూలు చేయాలని ఆదేశించారు. వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులు ఇంటింటి సర్వే నిర్వహించి ఆస్తి పన్నులు విధించలేనివి, అలాగే ఆస్తి పన్నులు విధించవలసిన ఆస్తులను వెంటనే గుర్తించడంతో పాటు తాగునీటి కనెక్షన్ ఉంటే వారి ఆస్తి పన్నుతో పాటు నీటి పన్ను చార్జీలు చెల్లిస్తున్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. ఆగస్టు 20 నాటికి పరిశీలించిన ఆస్తుల వివరాలను నివేదించాలన్నారు. ఆస్తి పన్నుల ఆస్తుల గుర్తింపు చర్యలలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన రెవెన్యూ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వార్డు సచివాలయం అడ్మిన్ కార్యదర్శులకు 24 గంటల్లో ఆస్తి పన్నుల విధింపునకు సర్వే నిర్వహణపై సమావేశం నిర్వహించి అసెస్మెంట్‌లు వేసే విధానంపై అవగాహనను కల్పించాలన్నారు. ఆస్తిపన్ను మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి వసూలుకు చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ సంస్థ చెల్లించవలసిన ఆస్తి పన్నులను రెండు వారాలలో వసూలు చేసే విధంగా చూడాలని జోనల్ కమిషనర్లు, డీపీవో మనీషా త్రిపాఠిని ఆదేశించారు. జీవీఎంసీ దుకాణాలు, వాణిజ్య సముదాయాల అద్దెలు, ఆశీలు, మార్కెట్ల ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్ణీత సమయంలో వసూళ్లు జరిపేలా చూడాలని అధికారులను ఆదేశించారు. టిడ్కో గృహాల లబ్ధిదారులు వారికి కేటాయించిన గృహాలలో నివాసము లేని వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి వారికి కేటాయించిన గృహాలను రద్దు చేయుటకు నివేదిక సిద్ధం చేశామని, ఇంకొంత మంది లబ్ధిదారులను గుర్తించవలసి ఉన్నదని కమిషనర్‌కు యూసీడీ ప్రాజెక్టు డైరెక్టరు పీఎం సత్యవేణి తెలియపరిచారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మిగిలిన వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి గృహాలను రద్దు చేయుటకు వెంటనే చర్యలు చేపట్టి నివేదికను సిద్ధం చేయాలని జోనల్ కమిషనర్లకు కమిషనరు ఆదేశించారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46,దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడదుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామ కాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

మాదకద్రవ్య రహిత సమాజం కావాలి

- విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ అంగముత్తు


ప్రతిజ్ఞ చేస్తున్న పోర్టు అథారిటీ అధికారులు, ఉద్యోగులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య వ్యసన రహిత, ఆరోగ్యవంతమైన భారత దేశనిర్మాణానికి విశాఖపోర్టు అథారిటీ కట్టుబడి ఉందని, ఇందుకోసం ప్రభుత్వాలు చేస్తున్న జాతీయస్థాయి ప్రయత్నాలకు తమ వంతు సహకారం అందిస్తుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు అన్నారు. కేంద్ర సామాజిక న్యాయ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న మాదకద్రవ్య రహిత భారత్ అభియాన్ 5వ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం విశాఖపట్నం పోర్టు అథారిటీ సాంబమూర్తి ఆడిటోరియంలో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ నిర్వహించింది. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ సీఈఎంఎస్, ఐఎంయూ విద్యాసంస్థల్లో మాదక ద్రవ్యాలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పోర్టు అథారిటీవిభాగాధిపతులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామనిప్రతిజ్ఞచేశారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి.జయ పేర్కొన్నారు. కళాశాలలో బుధవారం నిర్వహించిన నషా ముక్తభారత్ అభియాన్ ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. దేశంలో మాదకద్రవ్యాల వినియోగం అధికమవుతోందన్నారు. ముఖ్యంగా యువత డ్రగ్స్‌కు అలవాటుపడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పిస్తే కొంత సమాజమైన మారుతుందన్నారు. అనంతరం డ్రగ్స్ నష్టాలపై ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎన్ఎస్ఎస్ జోనల్ అధికారి పోల ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు గోపాలనాయుడు, నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

పాలిథిన్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు


చేపల వ్యాపారుల వద్ద జరిమానా వసూలు చేస్తున్న శానిటరీ సిబ్బంది

వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : వ్యాపారులు ఎవరైనా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని 16వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సూరిబాబు హెచ్చరించారు.

బుధవారం హెచ్‌బీ కాలనీ ప్రాంతంలోని చేపల వ్యాపారులు, సులబ్ కాంప్లెక్సు వద్ద నున్న టిఫిన్ దుకాణం వద్ద తనిఖీలు చేపట్టి పాలిథిన్ కవర్లు వినియోగిస్తున్న చేపల వ్యాపారులకు రూ.2 వేలు, టిఫిన్ దుకాణం వద్ద రూ.500, చిన్న చిన్న వ్యాపారుల వద్ద రూ.200 నుంచి రూ.500 వరకు జరిమానాలు విధించారు. వారి వద్ద నున్న ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. మరోసారి వాటిని వినియోగిస్తే ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సచివాలయం శానిటరీ సెక్రటరీలు శివ, సాంబమూర్తి, గౌతమి, శుభ్రం మేస్త్రీ నమ్మి చిన్నరాజు, జి.రాజు, బంగార్రాజు తదితరులు ఉన్నారు.

వైసీపీ హయాంలోనే దళితులకు న్యాయం

- వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు


మాట్లాడుతున్న సుధాకర్‌బాబు, వేదికపై కేకే రాజు తదితరులు

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబును గద్దె దింపే వరకు నిద్ర పోవద్దని వైసీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్‌బాబు పిలుపునిచ్చారు. మద్దిలపాలెం, వైసీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎస్సీ విభాగం విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయంలోనే దళితులకు న్యాయం జరిగిందన్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దళితుల్లో ఎవరైనా పుట్టాలని అనుకుంటారానని వ్యాఖ్యానించిన చంద్రబాబుకు వచ్చే ఎన్నికల్లో దళితులు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. వైసీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్ నాథ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని ఉన్నది ఉన్నట్టుగా అమలు చేసిన వ్యక్తి జగన్ అన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యంగం లేదని రెడ్‌బుక్ రాజ్యంగం అమలులో ఉందన్నారు. గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అన్ని కులాల కంటే దళితులే అధికంగా ఓటేశారన్నారు. దళితులకు జగన్ అన్ని విధాలుగా న్యాయం చేస్తారన్నారు. నగర అధ్యక్షుడు కెకె రాజు మాట్లాడుతూ దళితులకు ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి తీసుకెళ్లాలని ఆలోచించిన ఏకైక నాయకుడు జగన్ అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు వరుదు కళ్యాణి, రవిబాబు, సమన్వయకర్తలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలి : కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన- ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలో సామగ్రి, ఇతర పరికరాలను పరిశీలించాలని, ఇళ్లు అప్పగించే ముందు స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఇప్పటికీ నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారుల విషయంలో గ్రామసభ తీర్మానాలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనల మేరకు పట్టాలు రద్దుచేసి అర్హులకు అందించాలన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పీ4 సర్వేపై ఎమ్మెల్యేకు వివరాలు


ఎమ్మెల్యే వెలగపూడిని కలిసిన అధికారులు సత్యపద్మ, కనకమహాలక్ష్మి

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తూర్పు నియోజకవర్గం పరిధిలో బంగారు కుటుంబాల దత్తత, మార్గదర్శి వంటి విషయాలను వివరించడానికి ఎమ్మెల్యే వెలపూడి రామకృష్ణబాబును బుధవారం ఎంవీపీ కాలనీలోని ఆయన కార్యాలయంలో తూర్పు నియోజకవర్గం ప్రత్యేక అధికారి ఎం.సత్యపద్మ, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మీ కలిశారు. ఈ సందర్భంగా పథకానికి సంబంధించిన పలు అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. పీ4 సర్వే వివరాలను తెలిపారు. వివిధ మార్గాల్లో మార్గదర్శకుల వివరాలను సేకరిస్తున్నట్టు వెల్లడించారు.

కేజీహెచ్‌లో రక్త పరీక్షలకు ఇక్కట్లు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రెండు రోజులుగా కొన్ని రకాల రక్త పరీక్షలు జరగడం లేదు. పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లో అవసర మైన రీ ఏజెంట్స్ (కొన్ని రకాల కెమికల్స్) అందుబాటులో లేకపోవడంతోపాటు బయోకెమిస్ట్రీ ల్యాబ్‌లో పరీక్షలు నిర్వ హించే పరికరం బ్రేక్‌డౌన్ అయింది. అత్యంత కీలకమైన ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్ వంటి పరీక్షలు జర గకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. కొన్నిరకాల శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఈ పరీక్ష లు అవసరం. దీంతో సుమారు 200 మంది వరకు రోగు లు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. అత్యవసరమైన వారు బయట ల్యాబ్‌లలో చేయించుకోగా, మిగిలిన వారు ఎదురుచూస్తు న్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల ని కోరుతున్నారు.

జగన్మోహన్‌రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం

- కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి



వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్ గాంధీపై ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రియాంక దండి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ఒకటి, రెండు రాష్ట్రాల్లో జరిగిన ఉదాహరణ తీసుకున్నారని, ఈసీపై చేస్తున్న పోరాటంలో దేశ వ్యాప్తంగా జరిగిన ఓటు చోరీపై విచారణ చేయాలనేది కాంగ్రెస్ డిమాండ్ అని ఆమె పేర్కొన్నారు. రాహుల్ పోరాటానికి దేశంలో ప్రతిపక్ష పార్టీలన్నీ మద్దతు తెలిపాయని, వైసీపీ ఎందుకు మద్దతు ఇవ్వలేదని ఆమె ప్రశ్నించారు. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ అన్ని పార్టీ సమావేశాల్లో చంద్రబాబుకూటమి పార్టీలపై మాట్లాడారని, సందేహం ఉంటే తమ సొంత పత్రిక విలేకరులను పార్టీ సమావేశాలకు పంపించి ఉండవలసిందని ప్రియాంక దండి పేర్కొన్నారు. ఈసీకి, బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడే సాహసం జగన్‌మోహన్ రెడ్డి ఎందుకు చేయట్లేదని ప్రశ్నించారు.

అపస్మారక స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి

- చికిత్స అందిస్తున్న కేజీహెచ్ వైద్యులు



ఆరిలోవ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలో గల రాడిసన్ బ్లూ హోటల్ సమీపంలో గల బీచ్ సమీపంలోని తుప్పల వద్ద ఓ గుర్తు తెలియని వ్యక్తి పాయిజన్ తీసుకొని అపస్మారక స్థితిలో పడి ఉండడాన్ని గురువారం సాయంత్రం సుమారు ఆరున్నర గంటలకు స్థానికులు గమనించి తమకు సమాచారం ఇచ్చినట్టు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు తెలిపారు. వెంటనే అతడిని 108 ద్వారా కేజీహెచ్‌కు తరలించినట్టు సీఐ చెప్పారు. ప్రస్తుతం అపస్మారక స్థితిలోనే ఉన్నాడని, ఎవరైనా అతడి బంధవులు, తెలిసిన వారు ఉంటే ఆరిలోవ పోలీసులకు సంప్రదించాలని కోరారు.

పార్కు నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ శ్రావణి

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో ఉన్న గ్రీన్ బెల్ట్ ప్రాంతంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పార్కు నిర్మాణ పనులకు బుధవారం కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిశోర్‌కుమార్ శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఏఈ నీహారిక, సచివాలయం కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ విద్యుత్ కేబుల్ పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు

మురళీనగర్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) ; ఈపీడీసీఎల్ జోన్-2 మాధవధార ఎస్ఎస్‌టీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలో భూగర్భ విద్యుత్ కేబుల్ పనులకు బుధవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ప్రారంభించారు. ప్రజలకు మరింత నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే లక్ష్యంతో కేబుల్ తీగెల్ని నేల దిగువగా అమర్చే ప్రాజెక్టుని నగరంలో దశలవారీగా చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. 33 కేవీ, 11 కేవీకేబుల్స్‌ను ఈ పనుల్లో భూమి నుంచి అమర్చనున్నట్లు జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. భూమి లోపల కేబుల్స్ అమర్చడం వల్ల విద్యుత్ వ్యవస్థ మరింత సురక్షితంగా మారుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలోనూ విద్యుత్ అంతరాయాలు లేకుండా సరఫరా అందించే వెసులుబాటు భూగర్భ కేబుల్స్ ద్వారా సాధ్యపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈపీడీసీఎల్ డిప్యూటీ ఏఈ శివ సత్యనారాయణ, బీజేపీ నాయకులు సునీల్, 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, బీజేపీ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఆపండి

» దళిత గిరిజన, ప్రజా సంఘాల డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న జేవీ ప్రభాకరరావు, పక్కన దళిత గిరిజన ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రామాటాకీస్ రోడ్డు ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆస్పత్రి ఎదురుగా గల అంబేడ్కర్ భవన్‌లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం, దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) సంయుక్త ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఆపాలని, దళిత గిరిజన చేతి వృత్తిదారులపై భారాలు మోపవద్దు అనే అంశంపై బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తలుగా విచ్చేసిన డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకరరావు మాట్లాడుతూ దళిత గిరిజన చేతి వృత్తిదారులకు ఇస్తున్న 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను తొలగించడానికి రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని, దీనికి అయ్యే ఖర్చు వినియోగదారులే భరించాలనడం అన్యాయమన్నారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన లోకేశ్‌బాబు ఇప్పుడు ఏమీ మాట్లాడక పోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ వైటి దాస్, ఎంవి ప్రసాదరావు, రాంబాబు, వై. రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో హర్ ఘర్ తిరంగా



ర్యాలీ నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ నేపథ్యంలో విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం 'ప్రతి ఇంటికి జాతీయ జెండా' నినాదంతో హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించి దేశభక్తి నినాదాలు చేశారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల మాట్లాడుతూ దేశభక్తిని చాటే హర్ ఘర్ తిరంగ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. జాతీయ జెండా ఉన్నతి, ఔన్నత్యాన్ని చాటిచెప్పాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కెఎల్ శిరీష, అధ్యాపకులు ఎస్.అనురాధ, డాక్టర్ జె.లావణ్య, డాక్టర్ బి.హైమావతి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ ఎస్.అనూష, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ చిత్రాలన్నీ ఆణిముత్యాలే..

» వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ సినీ దర్శకుల్లో మేటి దర్శకుడు హిచ్‌కాక్ 126వ జయంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హిచ్‌కాక్ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైజాగ్ ఫిల్మ్ సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ 18వ శతాబ్దం చివరిలో 19వ శతాబ్దపు ప్రారంభంలో తన చిత్రాల ద్వారా సందేశాన్ని కాకుండా కామెడీ, సస్పెన్స్, థ్రిల్లింగ్ చూపించడంలో ఆయనకు ఎవ్వరూ సాటిరారన్నారు. ఆయనను నేటి తరానికి మార్గదర్శకులుగా పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా 1059లో అయన దర్శకత్వంలో రూపొందించిన ఇంగ్లీష్ చిత్రం నార్త్ బై నార్త్ వెస్ట్ చిత్రాన్ని ప్రదర్శించారు.



హిచ్‌కాక్‌కు నివాళి అర్పిస్తున్న వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రతినిధులు

రైల్వే ఉద్యోగులకు ప్రతిభా పురస్కారాలు



.ప్రతిభా పురస్కారాలు అందుకున్న ఉద్యోగులతో డీఆర్ఎం లలిత్ బొహ్రా

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో చిత్తశుద్ధితో ఆదర్శప్రాయ సేవలందించిన రైల్వే ఉద్యోగులకు డీఆర్ఎం లలిత్ బొహ్రా బుధవారం తన కార్యాలయంలో పురస్కారాలు అందించి అభినందించారు. స్టేషన్లు, లోకో షెడ్లు, ఇతర రైలు కార్యకలాపాలలో క్లిష్ట పరిస్థితులను విజయవంతంగా అధిగమించిన కమ్మూరు స్టేషన్ మాస్టర్ మహేంద్ర సింగ్ చౌదరి, సీనియర్ రైలు మేనేజర్ (పాసింజర్) ఆర్.వెంకటరమణ, సీనియర్ రైలు మేనేజర్లు (గూడ్స్) చలుమూరి రమణనాయుడు, కె.శ్రీనివాసరావు, లోకో పైలట్లు తమ్మినేని దుర్గారావు, కె.రామకృష్ణ, అసిస్టెంట్ లోకో పైలట్ వై.హనుమంతరావు, టెక్నీషియన్లు జుర్ సింగ్, బింబాధర్ బారిక్‌లకు మెమెంటో, ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఏడీఆర్ఎంలు మనోజ్‌కుమార్ సాహు, ఇ.శాంతరాం, సీనియర్ డీఎస్వో ఎం.కె.సాహు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

» విద్యార్థులతో నషా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఉపాధ్యాయులు, పాల్గొన్న అంగన్వాడీ కార్యకర్తలు

కంచరపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : మత్తు పదార్థాలకు దూరంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్ సాధ్యమవుతుందని జీవీఎంసీ ఆర్పీపేట ప్రాథమిక పాఠశాల హెచ్ఎం బి.సత్యవతి పేర్కొన్నారు. నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాల వల్ల కలిగే దుష్పరిణామాలను తెలుసుకోవాలన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వకార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా పోలీసులు పద్మావతి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రాక్టికల్స్ పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

» విశ్వసనీయత కలిగిన అబ్జర్వర్లకు బాధ్యతలు

» దూర విద్యా కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ నాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఏయూ దూర విద్యా కేంద్రం నిర్వహించే కోర్సులకు సంబం ధించి జరగనున్న ప్రాక్టికల్స్‌ను పర్యవేక్షించేందుకు విశ్వసనీయత కలిగిన అబ్జర్వర్లను నియమించినట్టు కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాక్టికల్ పరీక్షల పేరుతో జరుగుతున్న అడ్డగోలు వ్యవహారాలపై 'మారని ఏయూ తీరు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. ఇప్పటికే ప్రక్షాళన చేపట్టామని, ప్రాక్టికల్స్ నిర్వహించే కళాశా లల సంఖ్యను అనేక అంశాలను పరిశీలించి తగ్గించామన్నారు. మరోసారి ఆయా కళాశాలలను పరిశీలిస్తామన్నారు. ప్రాక్టికల్స్ డిగ్రీ కళాశాలలోనే నిర్వహించాలనే ఆలోచనలో ఉన్నామని, విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండడం, ప్రభుత్వ కళాశాలల సంఖ్య పరిమిత కావడంతో ఇబ్బందులు ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో మౌలిక సదుపాయాలను పరిశీలించేందుకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రాక్టికల్స్‌ను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించడానికి ఏయూ యాజమాన్యం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు.

నిరుపయోగంగా చేతిపంపులు

» నిర్వహణ మరచిన జీవీఎంసీ

» సాంకేతిక కారణాలు చూపి తొలగించేందుకు యత్నం



ఎన్జీజీవోస్ కాలనీలో..

మాధవధార, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఉచితంగా తాగునీరు అందించాలని జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన చేతిపంపులు (బోరువెల్స్) నిర్వహణ లేక నిరుపయోగంగా మిగిలాయి. ఇటీవలే వేసిన కొత్త బోర్లు కూడా అక్కరకు రాకుండా పోతున్నా జీవీఎంసీ తాగునీటి సరఫరా విభాగం అధికారులు స్పందించకోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేతిపంపులు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. జీవీఎంసీ 49వ వార్డు మురళీనగర్ ఎన్జీజీవోస్ కాలనీ వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయ బస్టాప్ వద్ద నివాసితుల కోసం వేసిన చేతిపంపు దారికి అడ్డంగా ఉందన్న కారణంగా ఓ బహుళ అంతస్థుల నిర్మాణదారుడు ఎలాగైనా దాన్ని తొలగించాలని చూస్తున్నారు. దాదాపు ఒక్కో చేతిపంపు అమరికకు ఏళ్ల క్రితమే రూ.70 వేల వరకు ఖర్చు చేసిన జీవీఎంసీ నిమ్మకు నీరెత్తినట్లు మిన్నకుండిపోతోంది. చేతిపంపు వేశామా? ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేశామా? అంతవరకే అన్నట్టుగా ఆ శాఖ ఆలోచనగా కనిపిస్తోంది. తర్వాత కాలంలో అది పనిచేస్తుందా? అక్కడ అసలు చేతి పంపు ఉందా? లేదా? అన్న విషయమే పట్టించుకోవడం లేదు.

ప్రతి ఇంటికీ కొళాయి కనెక్షన్లు వస్తున్న తరుణంలోనూ పోటీ పడి ప్రజాప్రతినిధులు ఏదో విధంగా తమ వార్డు అభివృద్ధి నిధుల్ని ఖర్చు చేసేలా వేసిన చేతిపంపులు, ఇపుడు నిరాదరణకు గురయ్యాయి. తాగునీటి విభాగం అధికారులు నిత్యం బిజీగా గడిపేస్తుండటంతో వీటి నిర్వహణ, పనితీరు ఏ వార్డులోనూ సక్రమంగా లేదు. జీవీఎంసీ 51వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ మారియట్ హోటల్ ఎదుట మరో చేతిపంపు ఇపుడు 60 అడుగుల దారి విస్తరణకు ఆటంకంగా మారిందని, తొలగించే ఆలోచనలో ఉన్నారు. తొలుత ఏర్పాటు చేస్తున్నపుడు చేతిపంపు ఎక్కడ వేయాలన్న ప్రణాళిక ఉండదు. తీరా ఇపుడు దారికి అడ్డమని, నిరుపయోగమని కారణాలు చూపి ఎడాపెడా తొలగించడానికి సాకులు వెతుకుతున్నారు. మరమ్మతులకు గురైన చేతి పంపులను బాగు చేస్తున్న సందర్భాలు తక్కువే. జీవీఎంసీ 50వ వార్డు సీతన్నగార్డెన్స్ రోడ్డులోనూ ఇదే పరిస్థితి. పని చేయని చేతిపంపు పక్కనే కార్పొరేటర్ వి.ప్రసాద్ రెండేళ్ల క్రితమే మరో కొత్త చేతిపంపును ఏర్పాటు వేయించారు.పాతబోరింగ్ ఊసే పట్టించుకోలేదు. వీటిపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

స్త్రీశక్తికి సర్వం సిద్ధం

... 5వ పేజీ తరువాయి

కూడా పెంచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలోనే కాకుండా దూరప్రాంతాలకు రాకపోకలు సాగించే మహిళల సంఖ్య కూడా పెరుగుతుందని, అందుకు తగ్గట్టుగా సర్వీసులు కూడా పెంచుకోవలసిన అవసరం ఉంటుందని అధికారులు లెక్కలు వేస్తున్నారు. పథకం ప్రారంభమైన వారం రోజుల తరువాత రోజువారీ ప్రయాణించే మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుందని చెబుతున్నారు. మహిళలకు రవాణా సౌకర్యాలు అందించడంలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆర్టీసీ ప్రధాన కార్యాలయ అధికారులు రీజియన్ అధికారులకు ఆదేశాలుజారీచేశారు.

అక్కరకు రాని ఆయుష్ ల్యాబ్!

... 5వ పేజీ తరువాయి

అదనపు ఖర్చు అవుతోంది. ల్యాబ్ అందుబాటులోకి వస్తే ఈ వ్యయం తగ్గుతుది. తద్వారా రోగులపై భారం తగ్గించడానికి అవకాశం ఉంటుంది. అదే సమయంలో సరికొత్త ఔషధాలు తయారీకి సంబంధించిన పరిశోధనలను ఇక్కడ నిర్వహించేందుకు అవకాశం ఉంది. ఔషధ పరిశోధన నూతన ఫార్ములేషన్ల అభివృద్ధికి అవకాశం ఉంటుంది. ఆయుర్వేద విద్యార్థులకు పరిశీలన, ప్రాక్టీస్ నిర్వహణకు కూడా ఉపయోగపడుతుందని చెబుతున్నారు. కాబట్టి ఉన్నతాధికారులు వీలైనంత తొందరగా టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ఉత్సవాల పేరిట కాసుల వేట

... 5వ పేజీ తరువాయి

ప్రకటించారు. ఎవరైనా సరే మట్టి లేదా ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో విగ్రహం చేస్తారు. వీరు మాత్రం జర్మన్ సిల్వర్‌తో తయారు చేస్తున్నారు. ఇది నీటిలో కరగదు. నిమజ్జనం చేయడానికి వీలు కాదు. ఈ విషయం పక్కనపెడితే అక్కడ 14 ఎకరాలు అందుబాటులో ఉండగా అందులో ఆరు ఎకరాలు కేవలం వాహనాల పార్కింగ్‌కు కేటాయించినట్టు ప్రకటించారు. అంటే ఏ సంఖ్యలో వాహనాలు వస్తాయో అర్థం చేసుకోవచ్చు. పార్కింగ్ ఫీజు కూడా ఉంటుంది. మరో రెండు ఎకరాల్లో ఫ్లవర్ షో పెడతామంటున్నారు. మిగిలిన స్థలంలో రకరకాల ఎగ్జిబిషన్లు పెట్టి వ్యాపారాలు నిర్వహిస్తారు. స్టాళ్ల అద్దెకు ఇచ్చి డబ్బులు వసూలుచేస్తారు. ఇదంతా వ్యాపార దృక్పథంతో చేస్తున్నారు. ఉత్సవానికి సుమారు రూ.70 లక్షల నుంచి రూ.80 లక్షలు వెచ్చిస్తున్నారు. అంతకు రెట్టింపు ఆదాయం కేవలం నెల రోజుల్లో పొందాలనేది లక్ష్యం. దీనికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేల పేర్లు, ఫొటోలు వాడుకుంటున్నారు. ఏపీఐఐసీ అధికారులు కూడా ఆ ఎమ్మెల్యేల సిఫారసుతోనే ఆ భూమిని ఉత్సవాలకు ఇచ్చారు. 14 ఎకరాలు నెల రోజులు వాడుకోవడానికి ఇస్తున్నందున దానికి తగ్గట్టుగా ఫీజు వసూలు చేయాలి. ఆ అసోసియేషన్ నుంచి ఎంత ఫీజు వసూలు చేశారని ప్రశ్నిస్తే ఏపీఐఐసీ అధికారులు సమాధానం ఇవ్వడం లేదు. ఇలా వ్యాపార ధోరణితో ఉత్సవాలను నిర్వహించే వారిని నాయకులే ప్రోత్సహించడాన్ని హిందూ పరిషత్ వంటి సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి.

దాతలకే మస్కా!?

... 5వ పేజీ తరువాయి

ఇక్కడి నుంచి ఈఓ రిలీవ్ కావడం మరో విచిత్రం. ఆమె ఇటీవల రిటైర్ కావడం, అమెరికా వెళ్లిపోతుండడంతో ఎప్పుడు వస్తారో తెలియక...లెక్కలు తేల్చడానికి సిద్ధపడ్డారని తెలిసింది. 2021లో ఇదంతా జరిగిన తరువాత కాళింగరి శాంతి ఈఓగా బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు పనిచేశారు. సహజంగా ఆమె ఇలాంటి ఆభరణాల లెక్కల్లో కచ్చితంగా ఉంటారు. కానీ ఆమె కూడా ఈ విషయంలో ఎందుకనో మౌనం వహించారు. గత వారం ఈ లెక్కలు అప్పగింతకు వచ్చినప్పుడు ఆ కాగితాలపై సంతకాలు చేయడానికి ఆమె నిరాకరించారు. ఒకరి తరువాత మరొకరు పెట్టాల్సిందేనని అంతా చెప్పడంతో అయిష్టంగానే సంతకం చేశారు. అమెరికా వెళ్లిపోతున్న రిటైర్డ్ ఈవో కూడా షాపింగ్‌మాల్ అధినేత ఎంత బరువైన తాపడం ఇచ్చారో సరిగ్గా లెక్క చెప్పకపోవడం వల్లనే రశీదు ఇవ్వలేదని వివరణ రాసి ఇచ్చినట్టు విశ్వసనీయ సమాచారం.

కమిషనర్ నుంచే ఆదేశం

- ఎస్.సుజాత, డిప్యూటీ కమిషనర్

కనకమహాలక్ష్మి ఆలయంలో వెండి లెక్కలపై విచారణ చేయాలని నేరుగా దేవదాయ శాఖ కమిషనర్ నుంచే ఉత్తర్వులు వచ్చాయి. దీనిపై విచారణ చేయాల్సి ఉంది. పాత వెండి ఆభరణాలు ఇచ్చి, కొత్త వెండి ఆభరణాలు తీసుకోవడానికి కమిషనర్ అనుమతి తప్పనిసరి. ఉన్నతాధికారులకు తెలియజేయకుండా, కనీసం ఫైల్ కూడా పెట్టకుండా ఇంత పెద్దమొత్తంలో వెండికి రశీదులు లేకపోవడం విచిత్రంగా ఉంది. విచారణలో పూర్తి వివరాలు తెలుస్తాయని భావిస్తున్నాం.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, అధికారులు

మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా విశాఖ

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను మాదక ద్రవ్యాల రహితంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో నిషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులు, ప్రజలు, యువత సమష్టిగా కృషి చేసి జిల్లాలో డ్రగ్స్‌ను నివారించాలన్నారు. అధికారులతో కలిసి పోస్టర్లు ఆవిష్కరించారు.

కేజీహెచ్‌లో పునఃప్రారంభంకానున్న గుండె శస్త్ర చికిత్సలు

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగంలో త్వరలోనే శస్త్ర చికిత్సలు పునఃప్రారంభం కానున్నాయి. హార్ట్ లంగ్స్ మిషన్, టెంపరేచర్ కంట్రోల్ మిషన్లు పని చేయకపోవడంతో ఎనిమిది నెలలుగా ఈ విభాగంలో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. దీంతో అనేక మంది రోగులు ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందలేక ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై పత్రికల్లో కథనాలు రావడం, రాజకీయ పార్టీలు కూడా ఆందోళనలు చేపట్టడంతో అధికారులు స్పందించారు, శస్త్ర చికిత్సకు అవసరమైన పరికరాలను తీసుకువచ్చారు. బుధవారం రెండు పరికరాలు కేజీహెచ్‌కు చేరుకున్నాయి, ఆపరేషన్ థియేటర్‌లో వాటిని ఇన్‌స్టాలేషన్ చేస్తున్నారు. శనివారం నుంచి శస్త్ర చికిత్సలను పునఃప్రారంభిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఐ. వాణి తెలిపారు.

అలరించిన గాత్ర కచేరి

డాబాగార్డెన్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : తెలుగు సంస్కృతిని చాటి చెప్పేది కళలేనని, అటువంటి కళలను కాపాడుకోవాలని సంగీత ప్రముఖులు పేర్కొన్నారు. డాబాగార్డెన్స్‌లోని ఐవీఎస్ శాస్త్రి సంగీత సమితి కార్యాలయంలో ఆ సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పురస్కరించుకుని జి. శారద సుబ్రహ్మణ్యంతో బుధవారం గాత్రకచేరి నిర్వహించారు. త్యాగరాజస్వామి సంకీర్తనలు, శ్రీకృష్ణ సంకీర్తనలు, ముత్తుస్వామి దీక్షితార్ సంకీర్తనలను శ్రావ్యంగా గానం చేశారు. అనంతరం నిర్వాహకులు కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి చైర్మన్ ఏ. వెంకట్రావు, కార్యదర్శి పి. జగన్‌మోహనరావు, సంయుక్త కార్యదర్శి వి. మధుసూదనరావు, ఎం. నాగేశ్వరరావు, ఎం. మధుబాబు, తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో

జ్ఞానాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో బుధవారం హోమ్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో వస్త్ర వనం పేరుతో హ్యాండ్లూమ్ ఎక్స్‌పో నిర్వహించారు.ప్రదర్శనలో కాస్ట్యూమ్స్ ఆఫ్ ఇండియా,వింటేజ్ బ్లాక్ ప్రింటింగ్, అలాగే దేశం నలుమూలలు నుంచి సేకరించిన విభిన్న రకాల చీరలను ఉంచారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ డా. షైజీ, అధ్యాపకులు సోని, గాయత్రి, శ్రీజ పాల్గొన్నారు.

కేవీలో ముగిసిన క్యాంపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : ముస్లిం తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయంలో జరుగుతున్న హీరక్ పంక్ టెస్టింగ్ క్యాంప్ బుధవారంతో ముగిసింది. ఈమేరకు నాట్స్, వాటి ప్రాధాన్యత, కిట్ ఇన్‌స్పెక్షన్, యూనిఫారం తనిఖీ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ భోర్ సింగ్ శిక్షకులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

జెండా పండుగకు విస్తృత ఏర్పాట్లు

» జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

» కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ అశోక్

మహారాణిపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ఆగస్టు 15న పోలీసు బేరక్స్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు సంబంధించి బుధవారం ఆయన కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. శకటాలు, స్టాల్స్ సిటింగ్ ఏర్పాట్లలో పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షం వచ్చినా కార్యక్రమం నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని తెలిపారు.జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం, వీఎంఆర్‌డీఏ, విద్య, వైద్యారోగ్య, గృహ నిర్మాణ, పర్యాటక, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో శకటాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. మత్స్యశాఖ, డీఆర్‌డీఏ ప్రాథమిక రంగాలకు చెందిన శాఖలు యూసీడీ, సహకార శాఖల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాలి

సదస్సులో సాహితీవేత్తలు



సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ

డాబాగార్డెన్స్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాల్సిన అవసరం ఉందని పలువురు సాహితీ సంస్థల ప్రతినిధులు అభిప్రాయపడ్డారు.ఇటీవల జమ్ము కశ్మీర్ చరిత్ర, సమస్యలపై ఇతివృత్తంగా వెలువడిన 25 పుస్తకాలను ప్రభుత్వం నిషేధించడం భావ ప్రకటన స్వేచ్ఛపై దాడిగా భావించాలన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో అరసం ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు ఆధ్వర్యంలో 'భావ ప్రకటనా స్వేచ్ఛను కాపాడుకుందాం' అన్న అంశంపై చర్చ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ పుస్తకాలను నిషేధించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఇటువంటి సమయంలో మేధావులు గొంతెత్తవలసిన అవసరం ఉందన్నారు. యూపీఎస్సీ మాజీ సభ్యుడు కేఎస్ చలం మాట్లాడుతూ ఆంగ్ల పుస్తకాల ముద్రణలో కష్టాలను వివరిస్తూ, అలాంటి పుస్తకాలను నిషేధించడం దారుణమన్నారు. నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ స్వేచ్ఛను హరించే ప్రతి చర్యను ఖండించాలన్నారు. రచయితలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉండాలని చెప్పారు. సమతా సాహితీ అధ్యక్షుడు మాటూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కశ్మీర్‌ను ఆదరించిన ప్రభుత్వాలు, పుస్తకాలను నిషేధించడం సరికాదన్నారు.సాహితీవేత్త మేడా మస్తాన్‌రెడ్డి మాట్లాడుతూ రచనల్లో అబద్ధాలు ఉంటే నిషేధించరని, నిజమైన రచనలను నిషేధిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సాహితీ స్రవంతి అధ్యక్షుడు పి. ఫ్రాన్సిస్, అమరావతి విశ్వసాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి సీహెచ్ చిన సూర్యనారాయణ, కేవీఎస్ మూర్తి, పరమేశ్వరరావు, పతివాడ నాస్తిక్, ఎం. సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వర్షం కవితల ప్రసంగం



మాట్లాడుతున్న కవి హనుమంతరావు

సీతంపేట, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) : రాజేంద్రనగర్‌లో ఉన్న ప్రిజమ్ డిగ్రీ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో వర్షంపై వివిధ కవుల వర్ణనపై కవితల ప్రసంగం బుధవారం అద్భుతంగా సాగింది. సహృదయ సాహితీ సంస్థ అధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కవి, రచయిత, అరసం ఉపాధ్యక్షుడు ఎస్. హనుమంతరావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో వివిధ కవుల కవితా స్పందనలను చక్కగా వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డివి సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, డాక్టర్ సూరపనేని విజయకుమార్, కుప్పిలి భీమేశ్వరరావు, చల్లా రాంబాబు, బి. రాధారాణి, తదితరులు పాల్గొన్నారు.

పునీతపేతురు ఆలయంలో ప్రత్యేక ప్రార్థనలు



ప్రార్థనలు చేస్తున్న ఫాదర్

జ్ఞానాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి) :పునీతపేతురు దేవాలయం వద్ద జరుగుతున్న దేవమాత మోక్షారోపణ మహోత్సవాల్లో భాగంగా విచారణకర్త ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా బలహీనులకు బలం తల్లి అన్న అంశంపై ఫాదర్ బి. మనోజ్ కుమార్ ప్రసంగించారు. అనంతరం ఉత్సవ తేరును సెబాస్టియన్ కాలనీ, బిషప్ కె. మరియాదాస్ కాలనీ, రావులపల్లి, వడిచర్ల వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ఎస్. విమల్‌రాజ్, వై. ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో ఆనందంగా ప్రజలు

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కూటమి నేతలు

పెదగంట్యాడ, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రజలంతా ఆనందంగా ఉన్నారని పెదగంట్యాడకు చెందిన కూటమి నాయకులు పేర్కొన్నారు. 75వ వార్డు పరిధి చినకోరాడ, పెదకోరాడ, నెల్లిముక్కు ప్రాంతాల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నింటినీ ప్రభుత్వం ఏర్పాటు తరువాత దశలవారీగా అమలు చేస్తున్నారని వారు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. ప్రజలు కూడా కూటమి ప్రభుత్వ హయాంలో తాము ఆనందంగా ఉన్నారని చెబుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో కోరాడలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు సంఘీభావాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోన చిన అప్పారావు, కుంకి వరలక్ష్మి, ఎ.మణికుమార్, మొల్లి పెంటిరాజు, నమ్మి అప్పారావు, ములకలపల్లి పెంటయ్య, ఉరుకూటి అప్పలరాజు, బొంగురాజు, కణితి సన్యాసమ్మ, పి.సరోజిని, ఎంఆర్‌పీఎస్ నాయకుడు అంజూర దీపక్, తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావాన్ని తెలుపుతున్న 75వ వార్డు కూటమి నాయకులు

నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అగనంపూడి: నిరుపేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ అన్నారు. వార్డు పరిధిలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తోందన్నారు. కూటమి శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ప్రజలకు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సత్యారావు, కుమార్, శ్రీనివాస్, రామునాయుడు, తదితరులు పాల్గొన్నారు.



గోతులమయమైన దుర్గా నగర్ జంక్షన్ రోడ్డు

దుర్గా నగర్‌లో గోతులను పూడ్చరూ..

గాజువాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక-అచ్యుతాపురం మార్గంలోని స్టీల్ ప్లాంట్ రోడ్డు దుర్గా నగర్ జంక్షన్ పెద్ద పెద్ద గోతులతో ప్రమాదకరంగా మారినా పట్టించుకునే నాథులే కరువయ్యారని స్థానికులతో పాటు ఈ మార్గంలో రాకపోకలు సాగించే ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం వర్షం కురిసినా ఇక్కడి గోతుల్లో నీరు నిలిచి మరిన్ని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని పలువురు వాహనదారులు వాపోతున్నారు. అందువల్ల అధికారులు తక్షణమే స్పందించి దుర్గా నగర్ కూడలిలోని గోతులను పూడ్చేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

అవయవ దానం గురించి తెలుసుకోవాలి

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అవయవ దానం ఆవశ్యకత గురించి ప్రజలు తెలుసుకోవడంతో పాటు వాటి అమలుకు కృషి చేయాలని డాక్టర్ రమ్య వేదుల కోరారు. అంతర్జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. అనేక మంది మరణానంతరం తమ అవయవాలను దానం చేస్తున్నట్టు ప్రకటిస్తుండగా, మరికొంతమంది తమ కుటుంబ సభ్యుల మరణానంతరం వారి అవయవాలను దానం చేసి ఎంతో మందికి ప్రాణదానం చేస్తున్నారన్నారు. అవయవ దానం పట్ల ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ప్రజలకు అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. సదస్సులో పలువురు వైద్య సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అగనంపూడి: సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు, అఖిలభారత అవయవ శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో బుధవారం స్థానికంగా అవయవదాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రూపొందించిన అవయవాల పోస్టర్లను ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గోపీకృష్ణ ఆవిష్కరించారు. అవయవ దానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సంఘం ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో ఏవో రవిరాజు, సంఘం ప్రతినిధులు వెంకటేశ్వరప్రసాద్, స్థానిక నాయకులు బండారు చందూరమేశ్, బి.సత్యనారాయణ, పలకా అచ్యుత్, తదితరులు పాల్గొన్నారు.

శ్రమించే కార్యకర్తలకు టీడీపీలో మంచి భవిష్యత్తు

86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): శ్రమించే కార్యకర్తలకు తెలుగుదేశం పార్టీలో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ 86వ వార్డు అధ్యక్షుడు నల్లూరు సూర్యనారాయణ అన్నారు. కూర్మన్నపాలెం, గ్రీన్ సిటీలలో టీడీపీ అభిమాని, ఫార్మా ఉద్యోగి పొన్నగంటి మురళీమోహన్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, ఫార్మా ఉద్యోగుల సమక్షంలో వైజాగ్ ప్రొఫైల్స్ డైరెక్టర్ వీవీ కృష్ణారావు, నల్లూరు సూర్యనారాయణల ఆధ్వర్యంలో మురళీమోహన్ కేక్ కట్ చేసి అందరికీ స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్ పాదయాత్ర సమయాల్లో పలు సేవా కార్యక్రమాలను నిర్వహించడమే కాకుండా ఎన్నికల్లో టీడీపీ కోసం ఫార్మా ఉద్యోగులందరినీ ఏకతాటిపైకి మురళీమోహన్ తెచ్చారని కొనియాడారు. మురళీమోహన్‌కు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, ఫార్మా ఉద్యోగులు వేగుంట శ్రీనివాసరావు, మానాపురం గణపతి, నల్ల రామారావు, వినోద్, సత్యనారాయణ, సురేశ్, మురళీ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నల్లూరు, తదితరుల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసిన పొన్నగంటి మురళీమోహన్

లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలి: కలెక్టర్ హరేంధిరప్రసాద్

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్‌యోజన- ఎన్టీఆర్ పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మాణాలు పూర్తి చేసిన ఇళ్లను లబ్ధిదారులకు అందజేయాలని కలెక్టర్ ఎంఎన్. హరేంధిరప్రసాద్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇళ్లలో సామగ్రి, ఇతర పరికరాలను పరిశీలించాలని, ఇళ్లు అప్పగించే ముందు స్థానిక ఎమ్మెల్యేలకు సమాచారం ఇవ్వాలన్నారు. లబ్ధిదారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకోవాలన్నారు. ఇప్పటికీ నిర్మాణాలకు ముందుకురాని లబ్ధిదారుల విషయంలో గ్రామసభ తీర్మానాలు చేసి చర్యలు చేపట్టాలన్నారు. నిబంధనల మేరకు పట్టాలు రద్దుచేసి అర్హులకు అందించాలన్నారు. సమీక్షలో హౌసింగ్ పీడీ సత్తిబాబు, ఆర్డీవోలు శ్రీలేఖ, సంగీత్ మాథుర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సినర్జీస్ కార్మికుల ర్యాలీ

కూర్మన్నపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): గత ఆరు నెలలుగా జీతాల బకాయిలను చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ సినర్జీస్ కంపెనీ కార్మికులు బుధవారం రాజీవ్‌నగర్ నుంచి కూర్మన్నపాలెం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు కేఎం శ్రీనివాస్, ఎం.రాంబాబు మాట్లాడుతూ కార్మికులకు జీతాలు చెల్లించకపోతే కుటుంబాలతో ఎలా జీవనం సాగిస్తున్నారన్నారు. బస్సు సౌకర్యాలను నిలిపివేయడం, పీఎఫ్ సొమ్మును కట్టకుండా కాలయాపన చేయడం, కార్మికులకు మౌలిక వసతులను కంపెనీ యాజమాన్యం కల్పించకపోవడం దారుణమన్నారు. ఆయా సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

అక్రమ కేసుల నుంచి విముక్తి

» ఎమ్మెల్యే గణబాబుకు కృతజ్ఞతలు తెలిపిన ఎల్జీ పాలిమర్స్ బాధితులు



ఎమ్మెల్యే పి. గణబాబుకు కృతజ్ఞతలు తెలుపుతున్న ఎల్జీ పాలిమర్స్ బాధితులు

గోపాలపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం జరిగిన ఎల్జీ పాలిమర్స్ విషవాయువు లీకేజీ ఘటనలో, అప్పటి ప్రభుత్వం పనితీరుపై నిరసన తెలిపిన వారిపై బనాయించిన అక్రమ కేసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవడంతో బాధితులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబును బాధితులు ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ హయాంలో తమపై అన్యాయంగా కేసులు పెట్టారని వారు వాపోయారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎల్జీ పాలిమర్స్ బాధితులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే పి.గణబాబు హామీ ఇచ్చారు.

సేంద్రీయ ఎరువులతో మేలు

పెందుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): సేంద్రీయ ఎరువుల వినియోగం పంటలకు ఎంతో మేలు చేకూరుస్తుందని గ్రీన్‌క్లైమెట్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. చినముషిడివాడ అలివేలు మంగాదేవి ఆలయ ప్రాంగణంలో బుధవారం కూరగాయల మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రీయ ఎరువులు వాడితే భూమిలో సారం పెరుగుతుందని, ఆ తరువాత వేసే పంటకు మరింత శక్తి చేకూరుతుందన్నారు. ఏపీపీసీబీ కోరమాండల్ ఫెర్టిలైజర్ సహకారంతో ఎకో సంచులను కాలనీవాసులకు అందజేశారు. వనమాలి సీటీజీ ప్రాంతీయ ఇన్‌చార్జి రేఖ ప్రకృతి సేద్యం చేస్తున్న వారికి విత్తనాలు, నారు అందజేస్తున్నామన్నారు. సంస్థ సమన్వయకర్త రాజేశ్వరి, కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కాళీమాత ఆలయానికి శంకుస్థాపన

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 52వ వార్డు ఉడాలేఅవుట్ కాలనీలో కాళీమాత ఆలయానికి శంకుస్థాపన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళీమాత ఆలయ నిర్మాణంతో కాలనీలో దాదాపు అన్ని ఆలయాలు ఉన్నట్టేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కాళీమాత ఆలయ కమిటీ చైర్మన్ సౌమిత్ర దత్త, స్వప్నన్‌పాత్రజ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి రాట ఉత్సవం

మల్కాపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు కొత్తనక్కవానిపాలెం శ్రీ కృష్ణ యాదవ యువజన సేవ సంఘం ఆధ్వర్యంలో కృష్ణాజన్మాష్టమి వేడుకలు నిర్వహించడంలో భాగంగా బుధవారం పందగరాటను వేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు, మహిళలు హాజరై పండగరాటు వద్ద పూజలు చేశారు.

ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని నెలకొల్పాలి

» సీఐ కేవీ సతీశ్‌కుమార్

పెందుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కళాశాలలో ర్యాగింగ్ రహిత వాతావరణాన్ని నెలకొల్పాలని సీఐ కేవీ సతీశ్‌కుమార్ అన్నారు. నవర విట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో పెందుర్తి పోలీసుల ఆధ్వర్యంలో 'ర్యాగింగ్ విద్యార్థుల భవితకు అడ్డంకి' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ర్యాగింగ్ వద్దు-సోదర భావం ముద్దు' అని విద్యార్థులకు సూచించారు. కళాశాలలో యాంటీ ర్యాగింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, కొత్త విద్యార్థులతో సోదర, సోదరి భావంతో మెలగాలని అన్నారు. ర్యాగింగ్ చర్యను బట్టి ఆరునెలలు నుంచి జీవితఖైదు వరకు కఠిన శిక్ష ఉంటుందన్నారు. అలాగే రూ. 2.5 లక్షల జరిమానా ఉంటుందని తెలిపారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని, ఎవరైన యూవ్‌టీజింగ్ చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు సూచించారు. అనంతరం విద్యార్థుల చేత 'సే నో టు డ్రగ్స్' ప్రతిజ్ఞ చేయించారు.



సభలో మాట్లాడుతున్న సీఐ కేవీ సతీశ్‌కుమార్

తహశీల్దార్‌గా వెంకట అప్పారావు బాధ్యతలు స్వీకరణ



వెంకట అప్పారావు

పెందుర్తి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): పెందుర్తి తహశీల్దార్‌గా ఐ.వెంకట అప్పారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఇప్పటి వరకు అరకు మండలానికి తహశీల్దార్‌గా పనిచేసిన ఆయన బదిలీపై పెందుర్తి వచ్చారు.

భూముల సేకరణపై అభ్యంతరాల స్వీకరణ నేడు

పెందుర్తిరూరల్, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): నార్త్ సింహాచలం నుంచి చింతలఅగ్రహారం వరకు రైల్వే శాఖ చేపట్టిన అదనపు రైలు ట్రాక్ నిర్మాణం కోసం సేకరించిన భూములకు సంబంధించి రైతుల నుంచి అభ్యంతరాల స్వీకరణ కార్యక్రమం పెందుర్తి తహశీల్దార్ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ల్యాండ్ అక్విజేషన్ కమ్ రెవెన్యూ డివిజనల్ అధికారి, ఇతర రెవెన్యూ, రైల్వే అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొనున్నారు. పొర్లుపాలెం, చీమలాపల్లి ప్రాంతాలకు సంబంధించిన రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని నోటీసులు జారీ చేశారు.

హర్ ఘర్ తిరంగా ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు, విద్యార్థులు, తదితరులు

ఎన్.ఎ.డి.జంక్షన్, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నామని బీజేపీ నగర కార్యదర్శి దాడి రమేశ్ అన్నారు. జీవీఎంసీ 90వ వార్డు ఎన్ఏడీ జంక్షన్ నుంచి బాజీ జంక్షన్ వరకు విద్యార్థులు, స్థానిక బీజేపీ నాయకులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీ బుధవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ జెండా విశిష్టత అందరికి తెలియజేయాలనే లక్ష్యంతో ప్రధాని ఈ కార్యక్రమాన్ని చేపట్టారని తెలిపారు. విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల గురించి నేటి యువత తెలుసుకోవడంతో పాటు వారిని ఆదర్శంగా తీసుకోవాలని అక్కిరెడ్డిపాలెం హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎల్ఎస్ కాంతం అన్నారు. హైస్కూల్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. జాతీయ జెండాలతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్కూల్ కమిటీ ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు ర్యాలీలో భాగస్వాములయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్ ఇస్మాయిల్, బి.రవిచంద్, నాయకులు సంగ్రాన నూకరాజు, సర్వసిద్ధి అనంతలక్ష్మి, కె.అప్పలరాజు, ఎస్.అంజి, దొప్ప అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

గోపాలపట్నం, ఆగస్టు 13(ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 89, 92 వార్డులకు చెందిన ఇద్దరు బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.85 వేల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్‌లను పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు బుధవారం అందజేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గణబాబు కోరారు.



పూజలందుకున్న పైడిమాంబ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

అగనంపూడి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక ఉక్కు నిర్వాసిత గ్రామాల ప్రజల ఆరాధ్య దేవత పైడిమాంబ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వేకువజామున అమ్మవారిని నూతన వస్త్రాలు, పుష్పాలతో అర్చకులు శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక రామాలయ ప్రాంగణం నుంచి భక్తులు అమ్మవారికి సారెను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో నగర సంకీర్తలు, లలితా పారాయణాన్ని పఠించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు విందుల నారాయణరావు, వి.సతీశ్, ఎ.గోవిందరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అగనంపూడి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వీఎస్ఈజెడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున గురువారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అగనంపూడి సెక్షన్ ఏఈ లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా అగనంపూడి, డొంకాడ, బీసీకాలనీ, కొండయ్యవలస, సాయినగర్, దానబోయినపాలెం, తలారివానిపాలెం, అండమాన్ కొండయ్యవలస, పెదమడక, దువ్వాడ, పినమడక, మంగళలెం, జేఎస్ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, వెదుళ్లనరవ, గంగవరం, శెట్టిపాలెం, లంకివానిపాలెం, అజనగిరి ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

డేటా విశ్లేషణపై పట్టు సాధించాలి

అగనంపూడి, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): డేటా విశ్లేషణపై విద్యార్థులు పట్టు సాధించాలని ఐసీటీ అకాడమీ స్టేట్ హెడ్ ఎస్.దినకర్‌రెడ్డి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం, ఇన్ఫోసిస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డేటా విశ్లేషణపై బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం డేటా విశ్లేషణ ప్రతి రంగంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. డేటా ఆధారిత నిర్ణయాలే పరిశ్రమల భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. విద్యార్థులకు డేటా విశ్లేషణపై ప్రావీణ్యం ఎంతో అవసరమని, ఇందులో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం దినకర్‌రెడ్డిని విజ్ఞాన్ యాజమాన్య ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు, ఈసీఈ విభాగాధిపతి ఉమామహేశ్వరి. తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

- **సార్, మేడమ్** : లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక)
- **కింగ్‌డమ్** : జగదాంబ
- **సన్ ఆఫ్ సర్దార్** : రమాదేవి
- **మహావతార్ నరసింహ** : సంగం, కిన్నెర, వెంకటేశ్వర-1, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), మౌర్య (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), మోహిని (గాజువాక), అరుణ (పెదగంట్యాడ)
- **హరిహర వీరమల్లు** : శారద, మెలోడి, శ్రీ వెంకటేశ్వర, శ్రీరామా, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీకాంతి, సౌజన్య, సుకన్య (గోపాలపట్నం), మౌర్య, నటరాజ్ (పెందుర్తి). మోహిని, మినీ మోహిని (గాజువాక), శ్రీకన్య, కన్య, హెవెన్ (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 21, టమాటా 48, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 22, పచ్చిమిర్చి 58, కాకరకాయలు 24, బీరకాయలు 18, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 26, బంగాళ దుంపలు 18, అరటీకాయ (పె)10, మునక్కాడలు (కిలో) 26, అల్లం (పాతది) 70, బరబాటి 28, ముల్లంగి 32, నిమ్మకాయలు (కిలో) 64, బద్దచిక్కుడు 50, దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 75, కొబ్బరికాయ (పెద్దది) 30, బీన్స్ (పెన్సిల్) 66, కీరదోస 30, కాప్సికమ్ 64, పొట్లకాయ (పెద్దది) 24, చేమదుంపలు 34, చిలగడ దుంపలు 44, కంద 40, దేముడు చిక్కుడు 62, గోరు చిక్కుడు 30, కూర పెండలం 26, బ్రకోలి 45, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 36, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)

విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519

చికెన్ ధరలు (బ్యాగ్)

రైతు ధర	98
లైవ్ ధర	118
విత్ స్కిన్	206
స్కిన్‌లెస్	216

స్వాతంత్ర్య దినోత్సవానికి రాజ్‌భవన్ నుంచి చరణ్‌కు ఆహ్వానం



అట్టాడ చరణ్

కూర్మన్నపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని రాజ్‌భవన్ (గవర్నర్ బంగ్లా)లో జరగనున్న కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితుడిగా గాజువాక నియోజకవర్గం కణితి ప్రాంతానికి చెందిన అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు అట్టాడ చరణ్‌కు ఆహ్వానం అందింది. ఈ నెల 15వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు జరిగే కార్యక్రమంలో చరణ్ పాల్గొనవలసిందిగా జిల్లా కలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం చరణ్ విశాఖ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) అకాడమీలో శిక్షణ పొందుతూ మేనమామలైన దుగ్గపు దానప్పలు, రవిల వద్ద కణితిలో నివాసం ఉంటున్నాడు. ఇటీవల థాయిలాండ్‌లో జరిగిన అండర్-16 జాతీయ ఏషియన్ బాలుర వాలీబాల్ పోటీల్లో చరణ్ కాంస్య పతకం సాధించిన సంగతి తెలిసిందే.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలపై భారం

గాజువాక, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో ప్రజలపై మరింత భారం పడుతుందని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో బుధవారం 66, 73 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించి ప్రతి ఇంటికి స్టిక్కర్లను అతికించారు. అదానీ స్మార్ట్ విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేస్తామని ఇంట్లోకి ఎవరొచ్చినా రానివ్వరాదని ప్రచారం చేశారు. ఇప్పటికే పెరిగిన ధరల భారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు జి.అప్పారావు, గణేశ్, సుబ్బన్న, బంగారునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న భక్తులకు వరం నిత్యాన్న ప్రసాదం



దేవస్థానం ఉద్యోగుల కృషితో ఆరంభం

- దాతల సహకారంతో 36 ఏళ్లుగా సాగుతున్న వైనం
- ప్రతిరోజూ సుమారు 3 వేల మందికి భోజనం
- రూ.36.45 కోట్లకు చేరిన అన్నదాన విరాళాలు

సింహాచలం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): అన్ని దానాల్లోకీ అన్నదానం మేలు అన్న ఆర్యోక్తిని సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఉద్యోగులు 36 ఏళ్ల కిందట నిజం చేశారు. రూ.50 వేలను విరాళంగా సమర్పించి పెద్దమనసుతో నిత్యాన్న ప్రసాద పథకానికి అంకురార్పణ చేశారు. ఈ క్రమంలో 1989 ఆగస్టు 24న అప్పటి దేవస్థానం ఈవో నరసింహమూర్తి ఆధ్వర్యంలో ప్రారంభమైన పథకం నేటికీ అప్రతిహతంగా సాగుతూ భక్తుల మన్ననలు అందుకుంటోంది.

అప్పన్న దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల ఆకలి తీర్చాలనే సదుద్దేశంతో దేవస్థానం ఉద్యోగులు మంచి మనసుతో ప్రారంభించిన అన్నప్రసాద పథకానికి అనేకమంది దాతలు నిరంతం సహాయ సహకారాలు అందిస్తున్నారు. దాంతో 2014లోని హుద్‌హుద్, 2021లోని కరోనా వంటి ప్రకృతి విపత్తుల వేళ దేవస్థానం అధికారులు నిత్యాన్న ప్రసాద పథకం కింద ఉడతా భక్తిగా వేలాది మందికి పులిహోర, కదంబం, దద్దోజనం, పులిహోర వంటి ప్రసాదాలను ప్యాకెట్లుగా చేసి బాధితులకు అందజేశారు.

రోజుకు 3 వేలమందికి

పథకం ప్రారంభించిన మొదట్లో ప్రతిరోజూ 200 మందికి మాత్రమే అన్నప్రసాదాన్ని అందించగా, ప్రస్తుతం ప్రతిరోజు కనీసం మూడువేల మంది భక్తులకు, ప్రభుత్వ ఆదేశాల మేరకు గరిష్ఠంగా ఐదు వేలమందికి అన్నప్రసాదాన్ని మధ్యాహ్నం, రాత్రి సమయంలో ప్రతిరోజు రెండువందల మందికి అన్నప్రసాదాన్ని రుచికరంగా వండి వడ్డిస్తున్నారు.



ఈ పథకానికి రూ.లక్షకు పైగా విరాళం సమర్పించిన దాతలను మహారాజ పోషకులని, రూ.50వేలు, అంతకంటే ఎక్కువ విరాళం ఇచ్చిన వారిని రాజపోషకులని, రూ.10వేలు అంతకంటే ఎక్కువ విరాళాలు సమర్పించిన వారిని పోషకులని వ్యవహరిస్తారు. దాతలకు నగదు రశీదుతోపాటు డోనార్ కార్డును అందజేస్తారు. డోనార్ కార్డుతో దాత కుటుంబసభ్యులకు ఏడాదిలో ఒకరోజు స్వామివారిని ఉచితంగా దర్శనం చేసుకునేందుకు వీలు కల్పిస్తారు. విరాళం అందజేసిన రోజున స్వామి దర్శనంతోపాటు శేష వస్త్రం, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేస్తారు. భక్తులు కోరిన రోజున ఏడాదికి ఒకసారి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు చేస్తారు. వారు అందించిన విరాళంపై వచ్చే వడ్డీతో భక్తులకు అన్నప్రసాదం



అందిస్తారు. ప్రతిరోజు అన్నప్రసాద భవనం ముందు బోర్డుపై ఆరోజు దాతల పేర్లను రాస్తారు.

విరాళాలివ్వాలంటే...

భక్తులు విరాళాలు సమర్పించేందుకు అప్పన్నస్వామి ఆలయం పరిసరాల్లో మూడు స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. దర్శనం అనంతరం బయటకు వచ్చు దక్షిణ రాజగోపురం వద్ద, పీఆర్వో కార్యాలయం, అన్నప్రసాద భవనం వద్ద విరాళాలను స్వీకరిస్తారు. విరాళాల పూర్తి సమాచారం కోసం భక్తులు 9398734612 నంబరులో సంప్రదించాలని అధికారులు ప్రకటించారు.

వడ్డీ సొమ్ముతోనే ప్రసాదం

భక్తితో దాతలు సమర్పించిన విరాళాలను జాతీయ బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి, దానిపై లభించే వడ్డీతో అన్నప్రసాద పథకం కింద పరిశుభ్రమైన వాతావరణంలో రుచికరమైన భోజనాన్ని సంప్రదాయరీతిలో విస్తరాకుల్లో వడ్డిస్తున్నారు. గత ఆర్థిక సంవత్సరం 2024-25నాటికి బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ చేసిన సొమ్ము సుమారు రూ.36.45 కోట్లకు చేరింది. డిపాజిట్లపై సుమారు రూ.2కోట్ల వరకు వడ్డీ లభిస్తున్నట్టు దేవస్థానం రికార్డులను బట్టి తెలుస్తోంది. విరాళలపై వచ్చే వడ్డీతో తాజా గణాంకాల ప్రకారం ఏడాదిలో సుమారు 12 లక్షల మందికి అన్నప్రసాదాన్ని అందిస్తున్నారు.

22వ వార్డులో ఐదుగురు ఆర్పీల తొలగింపు

మద్దిలపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక 22వ వార్డు శివాజీపాలెంలో ఐదుగురు రీసోర్స్ పర్సన్స్(ఆర్పీ)లను తొలగిస్తూ మెప్మా డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి భార్యలు ఆర్పీలుగా పని చేయడం నిబంధనలకు విరుద్ధమని, ఈ మేరకు 22వ వార్డు శివాజీపాలెంలో ఆర్పీలు కె.జానకి, కె.చంద్రకళ, కె.అమ్మాజీ, ఖాదర్ బాబా, అన్నపూర్ణలను విధుల నుంచి తప్పించారు. వీరు భర్తలు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో ఆర్పీలకు అనర్హులను పేర్కొంటూ తొలగించారు. వీరి స్థానంలో నిబంధనలు అనుసరించి కొత్త ఆర్పీలను వచ్చే నెల ఒకటోతేదీ లోగా నియమించాలని జీవీఎంసీ యూసీడీ అధికారులను మెప్మా డైరెక్టర్ ఆదేశించారు.

7 నుంచి యథావిధిగా జన్మభూమి, ఎల్‌టీటీ

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పరిధిలో స్టేషన్ పునరాభివృద్ధి పనుల నేపథ్యంలో కాచిగూడ, మౌలాలీ సి క్యాబిన్, జి క్యాబిన్, అమ్ముగూడ, సనత్‌నగర్ మీదుగా నడుస్తున్న జన్మభూమి, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లు సెప్టెంబరు ఏడు నుంచి యథావిధిగా రాకపోకలు సాగించనున్నాయని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-లింగంపల్లి-విశాఖ జన్మభూమి సెప్టెంబరు ఏడు నుంచి చర్లపల్లి, సికింద్రాబాద్, బేగంపేట స్టేషన్ల మీదుగా హాల్ట్‌లతో నడుస్తాయని, విశాఖ-ఎల్‌టీటీ-విశాఖ ఎక్స్‌ప్రెస్ రైళ్లు (18519/18520) సెప్టెంబరు ఏడు నుంచి కాజీపేట, చర్లపల్లి, సికింద్రాబాద్ స్టేషన్ల మీదుగా హాల్ట్‌లతో రాకపోకలు సాగించనున్నాయన్నారు.

మహబూబ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు కోచ్‌ల సవరణ

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, మహబూబ్‌నగర్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసుల కోచ్‌లను అక్టోబరు 22 నుంచి సవరించనున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. మొత్తం 22 కోచ్‌లు ఉంటాయన్నారు. విశాఖ నుంచి బయలుదేరే రైలుకు అక్టోబరు 22 నుంచి, తిరుగు ప్రయాణంలో అక్టోబరు 23 నుంచి ఇవి అందుబాటులోకి వస్తాయన్నారు.

ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మూడు కేటగిరీలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకార వేత నాలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోందని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది, పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రీ మెట్రిక్, ఇంటర్ నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ చదువుతున్న వారికి పోస్టుమెట్రిక్ ఉపకార వేతనాలు అందిస్తారన్నారు. డిగ్రీ, పీజీ, డిప్లమో చదువుతున్న వారికి టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ ఉపకార వేతనాలు అందుతాయన్నారు. ఇందుకోసం నేషనల్ ఉపకార వేతనాలు పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 31 వరకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన దివ్యాంగ విద్యార్థులు జాతీయ https://depwd.gov.in/scholarship వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశ దరఖాస్తుకు 20 వరకు గడువు

ఆరిలోవ, ఆగస్టు13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్ని ప్రైవేటు అన్-ఎయిడెడ్ పాఠశాలలో 2025-26 విద్యాసంవత్సరానికి ఒకటో తరగతితో ప్రవేశానికి ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి జె.చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పేద, బడుగు బలహీన వర్గాలవారికి విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లు కేటాయించిందన్నారు. గతంలో జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఇది కొనసాగింపన్నారు. ఈ నెల 31లోగా అడ్మిషన్ల ప్రక్రియ పూర్తవుతుందన్నారు. దరఖాస్తు సమర్పించిన తరువాతమార్పులు,సవరణలకు అవకాశం ఉండదన్నారు. ఐదు కిలోమీటర్ల పరిధిలోని ప్రైవేటు పాఠశాలల్లో మాత్రమే దరఖాస్తుకు వీలు కల్పించారన్నారు. చిరునామా ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఓటరు కార్డు, కరెంటుబిల్లు టెలిఫోన్ బిల్లు, రేషన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదైనా ఒకటి సమర్పించాలన్నారు.

ఏయూ ఉద్యోగికి జీతం చెల్లింపులో వేధింపులు

విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయంలో రూసా 2.0 పథకంలో భాగంగా పనిచేసిన ఉద్యోగికి జీతం చెల్లించకుండా అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఫుడ్ అండ్ డ్రగ్ ల్యాబోరేటరీలో యర్రా సుజాత అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. కొన్నాళ్లు పనిచేసినప్పటికీ పరికరాలు లేపోవడంతో ల్యాబ్ ప్రారంభం కాలేదు. దీంతో ఈమె అర్హతల మేరకు అధికారులు ఫుడ్ అండ్ న్యూట్రిషియన్ డిపార్ట్‌మెంట్‌లో కొంత కాలం తరగతులు చెప్పించారు. ఆ తరువాత రూసా కో-ఆర్డినేటర్‌గా వచ్చిన కంప్యూటర్ సైన్స్ అధికారి కంప్యూటర్ సైన్స్, ఐటీ కోర్సుల స్పెషల్ పేపర్లు టీచ్ చేసే బాధ్యతలను అప్పగించారు. విధులను నిర్వర్తించినప్పటికీ తొమ్మిది నెలల జీతాన్ని చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆమె తెలిపారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా రికార్డులు, టైమ్ టేబుల్ వివరాలను పరిశీలించి జీతం చెల్లించాలని ఆదేశించారు. అకౌంట్ సెక్షన్‌లో పనిచేసే కొందరు ఉద్యోగులు కావాలనే ఇబ్బం దులకు గురి చేస్తున్నారని, నైట్‌క్లాస్‌లకు సంబంధించి తీసుకున్న వేతనాన్ని గెస్ట్ ఫ్యాకల్టీగా తీసుకున్నారని తప్పు డు సమాచారాన్ని ఇచ్చారన్నారు. ఉన్నతాధికారులు సమస్యను గుర్తించి పూర్తి జీతం చెల్లించాలని కోరారు.

నవోదయ దరఖాస్తులకు గడువు పెంపు

కొమ్మాది ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): కొమ్మాది జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసేందుకు గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ వై.ఎస్.ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే విద్యాసంవత్సరానికి అర్హులైన అభ్యర్థులు ఈ నెల 27 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు కొమ్మాది కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

16 నుంచి టెక్సాస్‌లో 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సు

- ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సిరిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): 14వ అమెరికా తెలుగు సాహితీ సదస్సును ఈ నెల 16, 17 తేదీల్లో టెక్సాస్‌లోని హ్యూస్టన్ ఇండియాహౌస్‌లో నిర్వహించనున్నట్టు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఏయూ హిందీ భవన్ సెమినార్ హాల్‌లో బుధవారం మీడియాతో మాట్లాడారు. వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా, హ్యూస్టన్ తెలుగు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటుసదస్సును నిర్వహిస్తామన్నారు. మన దేశం నుంచి ముఖ్య అతిథులుగా తనతో పాటు బుర్రా



మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

సాయిమాధవ్, ప్రొఫెసర్ కాత్యాయిని, వీఎస్ ఆదిత్య, ప్రొఫెసర్ మాడభూషి సంపత్ కుమార్, డా.జి.వల్లీశ్వర్, జయంతి ప్రకాష్‌శర్మ, ఎం.రాధిక, ప్రొఫెసర్ ఈమని శివనాగిరెడ్డి, పలువురు సాహితీవేత్తలు హాజరవుతారన్నారు. ఇందులో భాగంగా తానా పూర్వ అధ్యక్షులు డాక్టర్ తోటకూర ప్రసాద్‌కు జీవన సాఫల్య పురస్కారాన్ని అందజేస్తారన్నారు. మన దేశానికి చెందిన ప్రముఖ రచయితల గ్రంథాలను కూడా ఆవిష్కరిస్తారన్నారు. ఉపాధ్యాయులకు సత్కారం, ప్రారంభ సభ, ఆర్య విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ పురోభివృద్ధికి శాశ్వతనిధి ప్రారంభ వేదిక, అమెరికా డయాస్పోరా తెలుగు కథ షష్టి పూర్తివేదిక, సాహితీవేత్తల ప్రసంగాలు, స్వీయకవితా పఠనం, తెలుగు అభివృద్ధిపై చర్చా వేదికలు, పుస్తకావిష్కరణలు ఉంటాయన్నారు.

త్వరితగతిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం

- అధికారులకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఆదేశం

సబ్బవరం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లల పా లెం-అమృతపురం మాస్టర్‌ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను వీఎంఆర్‌డీఏ కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఆదేశించారు. బుధవారం గొల్లలపాలెం- అమృతపురం మాస్టర్ ప్లాన్ రోడ్డు, పెదముషిడివాడ-దువ్వాడ రోడ్డు విస్తరణ, గాలిభీమ వరం రైతులకు ఇచ్చిన ఆర్‌సీ ప్లాట్ల అభివృద్ధి, నల్లరేగులపాలెంలో సమీకరించనున్న భూములను ఆయన పరిశీలించారు. సకాలంలో రైతులకు ఆర్‌సీ ప్లాట్లు అప్పగించాలన్నారు. కమిషనర్ వెంట ఎస్ఈ భవానీశంకర్, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, వీఎంఆర్‌డీఏ సర్వేయర్ స్నేహ, డిప్యూటీ తహశీల్దార్ సీహెచ్ అప్పారావు, మండల సర్వేయర్ ఎల్.అప్పారావు, సచివాలయ సర్వేయర్ లోకేశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.



గొల్లలపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

సింగిల్ విండో విధానంలో చవితి ఉత్సవాలకు అనుమతులు

- జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి ఉత్సవాలకు ఏర్పాటు చేయనున్న మండపాల అనుమతులకు జీవీఎంసీలో సింగిల్ విండో క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేశామని కమిషనర్ కేతన్ గార్గ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలో ఈ నెల 27న నిర్వహించే చవితి ఉత్సవాల సందర్భంగా నిర్వహణ కమిటీలకు అనుమతించేందుకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో, జోనల్ కార్యాలయంల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈఎన్‌వీ నరేష్‌కుమార్ 9848308823, సిటీ ప్లానర్ వి.మీనాకుమారి 83749966777, కార్యనిర్వాహక ఇంజనీరు డి.శ్రీధర్ 8187898427, అగ్నిమాపక అధికారి బి.కృపావరం 9912448555, ఆయా జోనల్ కమిషనర్లు, సహాయ వైద్యాధికారులు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు, కార్యనిర్వాహక ఇంజనీర్లను సంప్రదించాలన్నారు. మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలని కోరారు. ప్రజలు ఇంటి వద్ద మట్టి వినాయక విగ్రహాలను తొట్టెలో నీరు పోసి నిమజ్జనం చేయాలని, కాలనీవాసులు పార్కుల వద్ద చేయాలన్నారు. పబ్లిక్ ప్రదేశాలలో వినోద కార్యక్రమాలకు నోడల్ అధికారుల నుంచి అనుమతులు తీసుకోవాలన్నారు. ఉత్సవాల నిర్వహణలో పరిశుభ్రత, పారిశుధ్యం పాటించాలని సూచించారు.

వీఎంఆర్డీఏ చైర్మన్‌పై కేసు కొట్టివేత



జిల్లా కోర్టు వద్ద వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్‌గోపాల్‌పై పెట్టిన అక్రమ కేసును కొట్టి వేస్తూ జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం.ప్రదీప్‌కుమార్ తీర్పునిచ్చారు. గత ప్రభుత్వ హయాంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణంపై టీడీపీ చలో రుషికొండకు పిలుపునివ్వడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న ప్రణవ్‌గోపాల్ రుషికొండ చేరుకొని నిరసన తెలపడంతో కేసు నమోదు చేశారు. టీడీపీ లీగల్ సెల్ ప్రతినిధులు శోభన్‌బాబు, పార్థసారథి వాదనలు వినిపించారు. అక్రమంగా కేసు నమోదు చేసినట్టు భావించిన న్యాయమూర్తి ఎం.ప్రదీప్‌కుమార్ కేసు కొట్టి వేస్తూ బుధవారం తీర్పు వెలువరించారు.

జగన్‌కు చంద్రబాబును విమర్శించే హక్కులేదు

విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విశాఖపట్నం, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడిని విమర్శించే హక్కు మాజీ సీఎం జగన్‌కు లేదని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబుపై జగన్ వ్యాఖ్యలను ఖండించారు. వైసీపీ హయాంలో కుప్పంలో ప్రజాస్వామ్యాన్ని జగన్ ఖూనీ చేశారని, మూడు దశాబ్దాల తరువాత పులివెందలలో ప్రజాస్వామ్యబద్ధంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరిగాయన్నారు. పోలీసులపై వైసీపీ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని, గతంలో వైసీపీతో అంటకాగిన అధికారులు జైలు పాలవడం చూశామన్నారు. పులివెందుల, ఒంటిమెట్ట జడ్పీటీసీ స్థానాలను తెలుగుదేశం గెలుచుకుంటుందన్నారు.

ఎస్సీ అభ్యర్థులకు డిజిటల్ మార్కెటింగ్‌లో శిక్షణ

ఎంవీపీ కాలనీ, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌ఆధ్వర్యంలో ఎస్సీ అభ్యర్థులకు డిజిటల్ మార్కెటింగ్ అసిస్టెంట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద స్వల్పకాలిక నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసుగల అభ్యర్థులు పదోతరగతి ఉత్తీర్ణత సాధించాలి. ఉచిత మధ్యాహ్న భోజనం, స్టేషనరీ అందిస్తారు. శిక్షణానంతరం ధ్రువపత్రం, సంబంధిత రంగంలో ఉపాధి కల్పిస్తారు. వివరాలకు 79895 72891, 83090 59974 నంబర్లలో సంప్రదించాల్సి ఉంటుందన్నారు.